# ప్రజాభూమి

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com








తెలంగాణ ఎడిటర్ : విప్పల చంద్రశేఖర్ | గురువారం | 31.10.2024 | పేజీలు: 08 | నమూనా సంచిక | వెల : అమూల్యం




## రేవంత్ రెడ్డి.. ముందు నీ కుర్చీ పోకుండా చూసుకో

### నువ్వు ముఖ్యమంత్రి అయ్యావంటే కేసీఆర్ భిక్షే

- ఆయనకు నీకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది
- నీ సవాల్ కు సిద్ధం.. పాదయాత్ర చేద్దాం
- రేపా? ఎల్లుండా టైం చెప్పు.. నేను కేటీఆర్ వస్తం
- ఇప్పటికైన రేవంత్ చిల్లర మాటలు బంద్ చెయ్
- మీ దుర్భాష విని పిల్లలు చెడిపోతున్నారని వ్యాఖ్య
- సీఎం రేవంత్ వ్యాఖ్యలపై హరీశ్ రావు ఫైర్

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:

రేవంత్ రెడ్డికి సీఎం పదవి కేసీఆర్ పెట్టిన భిక్ష అని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదని, రేవంత్ సీఎం అయ్యేవాడు కాదన్నారు. బుధవారం తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో చిట్ చాట్ గా మాట్లాడారు. కేసీఆర్‌కు, రేవంత్‌కు నక్కకు.. నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. సీనియర్లు తన కుర్చీని గుంజుకోకుండా రేవంత్ చేసుకోవాలని, తన కుర్చీని ఎప్పుడు గుంజుకుపోతారోనన్న భయంలో

మిగతా 2లో..

# దేశానికి తెలంగాణ రోల్ మోడల్

## గాంధీ కుటుంబం మాట ఇస్తే నెరవేరుస్తది

- కుల గణన ఎక్స్ రే కాదు.. హెల్త్ చెకప్
- ఆదాయాన్ని సామాజిక న్యాయం ప్రకారం పంచుతాం
- సర్వే సమన్వయానికి జిల్లాకో అబ్జర్వర్ పెట్టాలి
- నవంబర్ 30లోగా ప్రక్రియ పూర్తి చేయాలి
- రేవంత్ చట్టాన్ని అమలు చేస్తడు తప్ప.. వ్యక్తిగత ఎజెండా ఉండదు
- పార్టీకి నష్టం చేసేలా మాట్లాడితే సహించను
- రాహుల్ ఆలోచనపై అభ్యంతరం చెప్పే వారిని పార్టీ క్షమించదు
- తెలంగాణ నుంచే మోదీపై యుద్ధం స్టార్ట్ చేద్దాం
- ప్రతిపక్ష పార్టీల విమర్శలు తిప్పికొట్టాలి
- కుల గణన అవగాహన సదస్సులో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి



ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:

గాంధీ కుటుంబం ఒక మాట ఇస్తే హరిహరాదులు అడ్డు వచ్చినా అది నెరవేర్చి తీరుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం గాంధీ భవన్ లో కుల గణనపై అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడుతుందని సామాజిక, ఆర్థిక రాజకీయ కులగణన చేస్తామని రాహుల్ గాంధీ మాట ఇచ్చారని, సెప్టెంబర్ 17న తుక్కుగూడ సభలో సోనియా గాంధీ గారు కూడా తెలంగాణ ప్రజలకు మాట ఇచ్చారని రేవంత్ గుర్తు చేశారు. రాజకీయాల్లో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా, అడ్డంకులు వచ్చినా ప్రజలకు ఇచ్చిన మాట నెరవేర్చడంలో సోనియా సఫలీకృతం అయ్యారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసి ఇచ్చిన మాట నెరవేర్చారని రేవంత్ తెలిపారు. గాంధీ కుటుంబం ఒక మాట ఇస్తే హరిహరాదులు అడ్డు వచ్చినా అది నెరవేర్చి తీరుతుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట నిలబెట్టడం ఇక్కడున్న ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. రేవంత్ రెడ్డి రెడ్డినా, మహేష్ గౌడ్ గౌడా అనేది కాదు.. మనం

మిగతా 2లో..

## 8 గంటలపాటు విచారణ



ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:

కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఫామ్ హౌస్ కేసు విచారణ సుమారు 8 గంటల పాటు కొనసాగింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం శంకర్పల్లి మండలం జన్వాడ గ్రామ పరిధిలోని రంగారావు ఫామ్ హౌస్ శ్రీమతే ప్రాపర్టీస్ లో జరిగిన సంఘటనపై కేసు

- మోకిలా పీఎస్‌లో కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలపై ప్రశ్నల వర్షం
- జన్వాడ ఫామ్ హౌస్‌లో మరోసారి సోదాలు
- 35(3) బీఎంఎస్ యాక్ట్ కింద నోటీసులు జారీ
- రాజ్ పాకాలను మరోసారి విచారణకు పిలిచే చాన్స్
- విచారణకు అన్నివిధాలా సహకరించా
- రాజ్ పాకాల

2

## కేసీఆర్ పేరు చెరిపితే చెరగదు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ధాన్యం కొనుగోళ్లకు కాంగ్రెస్ ధాం ధాం
- పది నెలల్లో ఇచ్చినదాని కంటే లాక్కున్నదే ఎక్కువంటూ ట్వీట్

2



## స్పెషల్ డెడికేటెడ్ కమిషన్ నియమించాలి

- బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు కీలక ఆదేశాలు
- రెండు వారాల్లో కమిషన్ ఏర్పాటు చేయాలి
- సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ఉంది
- స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వానికి ఆదేశాలు

2

### ముగ్గురు ఐపీఎస్‌లపై ఈడీకి ఫిర్యాదు

- అమోయ్ కుమార్, నవీన్ మిట్టల్, మాజీ సీఎస్ సోమేష్ కుమార్‌లపై కొండపూర్ వాసుల ఫిర్యాదు
- తమ భూమిపై ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి మోసం చేశారని బాధితుల ఆరోపణ

2



## సెక్రటేరియట్ బందోబస్తు సెక్యూరిటీ మార్పు

- ప్రభుత్వం కీలక నిర్ణయం
- టీజీఎస్పీ నుంచి టీజీఎస్పీఎఫ్‌కు అప్పగింత
- సీఎం నివాసం వద్ద ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో పటిష్ట భద్రత

4



## నందనవనం అర్హులకు న్యాయం చేస్తాం

- అక్కడ ఇండ్లను ఆక్రమించుకున్న వారిని ఖాళీ చేయించండి
- అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు

4



## ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ

- కౌశిక్ రెడ్డి, బల్మూరి వెంకట్ రెడ్డి మధ్య మాటల యుద్ధం
- జన్వాడ రేవ్ పార్టీపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల విమర్శలు
- అక్కడ డ్రగ్స్ తీసుకున్నారంటూ హస్తం నేతలు ఆరోపణలు
- డ్రగ్స్ టెస్ట్‌కు రావాలని ఇరు పార్టీల నేతల సవాల్
- యూరిన్ టెస్ట్‌కు శాంపిల్స్ ఇచ్చిన హస్తం నేతలు
- మేం డబ్బాతో రెడీ అంటూ పాడి కౌశిక్ రెడ్డి కామెంట్

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:

సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న చిల్లర రాజకీయాలతోనే తమ పంచాయితీ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. తనను కూడా డ్రగ్స్ కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ మీద కూడా ఇదే కుట్ర చేసి విఫలమయ్యారని తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌తో పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి తన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఎంపీలతో డ్రగ్స్ టెస్టుకు రావాలని సవాలు విసిరారు. తమ ఎమ్మెల్యే అందరూ వెయిట్ చేస్తున్నారని, ఇప్పటివరకు మమ్మల్ని పిలవలేదన్నారు. తాము డబ్బాలు పట్టుకుని రెడీగా ఉన్నామని తెలిపారు. కేసీఆర్ పేరు

మిగతా 4లో..

### రాష్ట్రంలో కాంగ్రెస్ అవినీతి పాలన

- ఢిల్లీకి డబ్బులు పంపించడమే తప్ప ఇచ్చిన హామీలపై ధ్యాస ఉందా?
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఫైర్
- అక్రమాలకు పాల్పడిన మిల్లర్లకే మళ్లీ ధాన్యం అప్పగిస్తారా?
- దీని వెనుక ఉన్న చీకటి ఒప్పందమేంటి?
- జీవోలను కూడా పబ్లిక్ డొమైన్ లో పెట్టడం లేదని విమర్శ

2

## మా ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరడం లేదు

- అదంతా ఫేక్ ప్రచారం
- ఆ పార్టీ నుంచి 20 మంది కాంగ్రెస్‌లోకి వస్తున్నరు
- కానీ ఇప్పుడు మేము చేర్చుకోవడం లేదు
- ఏడాది తర్వాత గులాబీ పార్టీ పని ఖతం అయితది
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- కేసీఆర్ అసెంబ్లీకి వచ్చే ముఖముందా?
- హరీశ్ రావుకు రుణమాఫీపై మాట్లాడే అర్హత లేదంటూ ఫైర్

4





## కేసీఆర్ పేరు చెరిపితే చెరిగేది కాదు

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

మరి కొన్ని రోజుల్లో రాష్ట్ర రాజకీయాల నుంచి మాజీ సీఎం కేసీఆర్ పేరు లేకుండా చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం స్పందించారు. తెలంగాణ చరిత్ర నుంచి కేసీఆర్ పేరును చెరిపితే చెరిగేది కాదని కేటీఆర్ పేర్కొన్నారు. "రేవంత్.. మీరు చెప్పులు మోసిన నాడు ఆయన ఉద్యమానికి ఊపిరి పోశారు. పదవుల కోసం పరితపిస్తున్న నాడు, ఆయన ఉన్న పదవిని తృణప్రాయంగా వదిలేశారు. ఉద్యమకారుల మీద గన్ను ఎక్కుపెట్టిన నాడు, ఆయన ఉద్యమానికి తన ప్రాణాన్ని ఫణంగా పెట్టారు. నువ్వు సాధించుకున్న తెలంగాణను చంపేందుకు బ్యాగులు మోస్తున్ననాడు, ఆయన తెలంగాణ భవిష్యత్ కు ఊపిరి పోశారు. చిట్టినాయుడు.. నువ్వా! కేసీఆర్ పేరును తుడిచేది? తెలంగాణ చరిత్ర కేసీఆర్" అని కేటీఆర్ తన అధికారిక ఎక్స్ అకౌంట్లో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతన్నలు అరిగోస పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. "మూసీపై ముందుకు కొనుగోళ్ళపై వెనక్కు. రామన్నపేటకు రైరై కొనుగోలు సెంటర్లకు నై నై. దామగుండం ధనాధన్ ధాన్యం కొనుగోళ్లు ఢాం ఢాం. కొనుగోళ్లకు దిక్కులేదు కాంగ్రెస్ కోతలకు లెక్క లేదు. దళారులకు దండిగా రైతన్నలకు దండగా. నాడు క్వింటాలుకు రూ.2,300 అమ్ముకున్న రైతు కాంగ్రెస్ సర్కార్ పుణ్యమా అని నేడు రూ.1,800 లకు అమ్ముకుంటున్నాడు. ఎద్దేడ్చిన వ్యవసాయం రైతు ఏడ్చిన రాజ్యం ఎప్పుడు బాగుపడదు"అని కేటీఆర్ విమర్శించారు.

## స్పెషల్ డెడికేటెడ్ కమిషన్ నియమించాలి



**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌ల అమలుపై ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ వర్గాలకు కల్పించాల్సిన రిజర్వేషన్‌ల శాతంను నిర్ణయించడానికి వీలుగా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం డాక్టర్ కె.కృష్ణమూర్తి కేసులో, త్రిసభ్య ధర్మాసనం వికాస్ కిషన్‌రావు గవాలి కేసులో వెలువరించిన ఆదేశాలను పాటించి రాష్ట్రంలో కూడా ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు బుధవారం హైకోర్టులో జరిగిన వాదనల అనంతరం జస్టిస్ ఎస్.నంద ఏకసభ్య ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందుకు సంబంధించి జస్టిస్ ఎస్.నంద ఏకసభ్య ధర్మాసనం ముందు సీనియర్ అడ్వకేట్, మాజీ అడ్వకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్ పిటీషనర్ పక్షాన వాదనలను వినిపించారు. అనంతరం జస్టిస్ ఎస్.నంద, ఏకసభ్య ధర్మాసనం పిటీషనర్ ఆర్.కృష్ణయ్య ప్రజాప్రయోజన వ్యాజ్యంలో లేవనెత్తిన అంశాలను సమర్థించింది.

**హైకోర్టు తీర్పును గౌరవించి నిర్ణయం తీసుకోవాలి : ఆర్. కృష్ణయ్య**

ప్రభుత్వం రాష్ట్ర బీసీ కమిషన్‌కు స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్‌ల శాతంను నిర్ణయించేందుకు ప్రత్యేకంగా బాధ్యతలను అప్పగించింది. దీనిపై బీసీలకు రాజకీయ రిజర్వేషన్‌లలో ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా ఉండేందుకు వీలుగా హైకోర్టులో సవాల్ చేస్తూ రిట్ పిటిషన్ వేశారు. ఆర్.కృష్ణయ్య వ్యాజ్యాన్ని ఏకసభ్య ధర్మాసనం పరిశీలించి వాదనలు విన్నది. రిజర్వేషన్లపై అధ్యయాన్ని బీసీ కమిషన్‌కు అప్పజెప్పడం సరికాదని హైకోర్టు తెలిపింది. బీసీ కమిషన్‌కు అప్పగించడం సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమని హైకోర్టు పేర్కొన్నది. ఈ క్రమంలోనే వెంటనే చర్యలు చేపట్టాలని కోర్టు ఆదేశించింది. హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వంను 'డెడికేటెడ్ కమిషన్'ను నియమించాలని ఆదేశించడంపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హర్షం ప్రకటించారు. ప్రభుత్వం ఇప్పటికైనా హైకోర్టు తీర్పును గౌరవించి వెంటనే నిపుణులతో కూడిన 'డెడికేటెడ్ కమిషన్'ను నియమించాలని ఆయన కోరారు.

# దేశానికి తెలంగాణ రోల్ మోడల్



(మొదటి పేజీ తరువాయి)

మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టే వారసులమని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డికి ప్రత్యేక గుర్తింపు ఏమీ లేదు.. కాంగ్రెస్ పార్టీనే రేవంత్ రెడ్డికి గుర్తింపు ఇచ్చింది. మీరంతా కష్టపడితేనే నాకు ఈ బాధ్యత వచ్చిందని గాంధీ కుటుంబం మాట ఇచ్చిందంటే మరో చర్చకు తావు లేదని, చర్చకు అవకాశం ఇచ్చారంటే వారు పార్టీ ద్రోహులేనని స్పష్టం చేశారు.

**33 జిల్లాలకు 33 మంది అబ్జర్వర్స్...**

పార్టీ ఎజెండాతోనే ప్రజల్లోకి వెళ్లామని, పార్టీ విధానాన్ని అమలు చేయడమే మన ప్రభుత్వ విధానమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ ఐడియాలజీతో సంబంధం ఉన్న నిరంజన్‌ని బీసీ కమిషన్ చైర్మన్ గా నియమించుకున్నామన్నారు. పని చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నా... ప్రతీ క్షణం సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యతకాంగ్రెస్ క్యాడర్, లీడర్స్ పై ఉందని రేవంత్ సూచించారు. కుల గణనపై సమన్వయం చేసుకునేందుకు 33 జిల్లాలకు 33 మంది అబ్జర్వర్స్ ను నియమించాలన్నారు. బాధ్యతగా పని చేయండని, మీ కష్టానికి ఫలితం తప్పకుండా ఉంటుందని, రాహుల్ గాంధీ ఇచ్చిన మాట అమలు చేసే క్రమంలో ఎవరు అభ్యంతరకరంగా వ్యవహరించినా వారిని పార్టీ క్షమించదని హెచ్చరించారు. దేశానికి తెలంగాణ ఒక మోడల్ గా మారాలి.. ఆ దిశగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. తెలంగాణ మోడల్ దేశంలో రాహుల్ గాంధీని ప్రధానిని చేసేలా ఉంటుంది. నవంబర్ 31లోగా కులగణన పూర్తి చేసి భవిష్యత్ యుద్ధానికి సిద్ధం కావాలని సలహా ఇచ్చారు.

**10 నెలల్లో 50 వేల ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చాం...**

తెలంగాణ నుంచే నరేంద్ర మోదీపై యుద్ధం ప్రకటించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కులగణన ఎక్స్ రే మాత్రమే కాదు.. ఇది మెగా హెల్త్ చెకప్ లాంటిది.. ప్రభుత్వ ఆదాయాన్ని సామాజిక న్యాయం ప్రకారం పంచడమే కాంగ్రెస్ విధానమని భవిష్యత్ లో కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో మన మోడల్ ను పరిగణనలోకి తీసుకునేలా మోడల్ డాక్యుమెంట్ ను కేంద్రానికి పంపుతామన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా డీఎస్సీ పూర్తి చేసి ఉద్యోగ నియామక పత్రాలు అందించాం. రాజకీయ మనుగడ కోసం అడ్డంకులు సృష్టించినా 10 నెలల్లో 50వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామని గుర్తు చేశారు. కొంతమంది అగ్రవర్ణాల కోసమే గ్రూప్ 1 నిర్వహిస్తున్నారని, బలహీన వర్గాలకు అన్యాయం చేస్తున్నారని ఒక వాదన తీసుకొచ్చారు. సెలక్ట్ అయిన 31,383 మందిలో 10శాతం లోపు మాత్రమే అగ్రవర్ణాలు ఉన్నారని రేవంత్ తెలిపారు. 57.11 శాతం బీసీలు,15.38 శాతం ఎస్సీలు, 8.87 శాతం ఎస్టీలు, 8.84 ఈడబ్ల్యూఎస్ కోటాలో సెలక్ట్ అయ్యారన్నారు. పార్టీకి నష్టం చేకూర్చేలా ఎవరైనా ఇష్టానుసారంగా మాట్లాడితే పార్టీ సహించదని రేవంత్ రెడ్డి చట్టాన్ని అమలు చేస్తాడు తప్ప... వ్యక్తిగత ఎజెండాతో పనిచేయదని, ప్రతిపక్షాల కుట్రలను ప్రతీ ఒక్కరు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.



# 8 గంటలపాటు విచారణ

(మొదటి పేజీ తరువాయి)

విచారణ ముగిసింది. హైకోర్టు ఆదేశాల మేరకు కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల తన అడ్వకేట్‌తో బుధవారం మోకిలా పోలీస్ స్టేషనకు వచ్చారు. విదేశీ మద్యం, విజయ్ మద్దూరికి డ్రగ్స్ ఎలా వచ్చాయి అనే అంశాలపై మోకిలా పోలీస్ స్టేషన్ లో విచారణ జరిపారు. అనంతరం ఆయనను జన్వాడ నివాసానికి తీసుకెళ్ళిన పోలీసులు మరోసారి జన్వాడ నివాసంలో సోదాలు నిర్వహించారు. అనంతరం రాజ్ పాకాలను మళ్లీ మోకిల పీఎస్‌కు తీసుకెళ్లి విచారించిన పోలీసులు.. 35(3) బీఎంఎస్ యాక్ట్ కింద నోటీసులు జారీ చేశారు. విజయ్ మద్దూరి స్టేట్‌మెంట్ ఆధారంగా విచారణ కొనసాగిందని, కేసు దర్యాప్తు దశలో ఉందని, అవసరమైతే రాజ్ పాకాలను మరోసారి విచారణకు పిలుస్తామని నార్సింగి ఏసీపీ రమణగౌడ్ తెలిపారు.

**విచారణకు సహకరించా: రాజ్ పాకాల**

'పోలీసుల విచారణకు సహకరించా. అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పా. మా ఫామ్‌హౌస్‌లో జరిగింది ఫ్యామిలీ పార్టీ. విజయ్ మద్దూరి ఎలాంటి స్టేట్‌మెంట్ ఇవ్వలేదు. ఎవరికో పాజిటివ్ వస్తే నాకేంటి సంబంధం. మా ఫ్యామిలీ డిస్టర్బ్ అయింది.. ఫ్యామిలీ పార్టీ చేసుకోకూడదా?.. కావాలనే ఇష్యూను పెద్దదిగా చిత్రీకరిస్తున్నారు' అని విచారణ అనంతరం రాజ్ పాకాల మీడియాతో అన్నారు. కాగా, మంగళవారం కూడా రాత్రి విజయ్ మద్దూరి నివాసంలో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఆయన ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అనుమతి లేకుండా మద్యం పార్టీ నిర్వహించారనే కారణంతో రాజ్ పాకాల తోపాటు, కొకైన్ తీసుకున్నట్టు నిర్ధారణ అయిన విజయ్ మద్దూరి (56)పై పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం రాత్రి విజయ్ మద్దూరికి 41 సీఆర్‌పీసీ కింద పోలీసులు నోటీసులు ఇచ్చి, స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. విచారణ నిమిత్తం సోమవారం పోలీస్‌స్టేషన్‌కు రావాలని వారు సూచించినా.. ఆయన సాయంత్రం వరకు కూడా స్టేషన్‌కు రాలేదు. ఇక శనివారం రాత్రి పార్టీ నుంచి వెళ్లిపోయిన రాజ్ పాకాల అజ్ఞాతంలోకి వెళ్లారు. ఈ నేపథ్యంలో మోకిల పోలీసులు సోమవారం దర్యాప్తు కోసం రాయదుర్గంలోని రాజ్ పాకాల నివాసానికి వెళ్లారు. తాళం వేసి ఉండటంతో ఇంటి బయట నోటీసులు అతికించారు. కాగా, బుధవారం రాజ్ పాకాల విచారణకు హాజరయ్యారు.

# రేవంత్ రెడ్డి.. ముందు నీ కుర్చీ పోకుండా చూసుకో

(మొదటి పేజీ తరువాయి)



ఉన్నాడన్నారు. ఐదేళ్ల తర్వాత వచ్చేది బీఆర్ఎస్ మాత్రమేనని.. సీఎం అయ్యేది కేసీఆర్ అని స్పష్టం చేశారు. దేశంలో కాంగ్రెస్ మూడుసార్లు ఓడిందని, మరి కాంగ్రెస్ ఖతం అయిపోయిందా? అంటూ ప్రశ్నించారు. 31 సాకులు చూపుతూ రుణమాఫీ చేయకుండా రేవంత్ రైతులను మోసం చేశారని విమర్శించారు. ఆరు మంత్రి పదవులు నింపేందుకే రేవంత్‌కు హైకమాండ్ అనుమతి ఇవ్వట్లేదన్నారు. కేసీఆర్ పవర్‌ఫుల్ ఫైటర్, లీడర్ అని చెప్పారు. రేవంత్‌రెడ్డి చిల్లరమాటలు ఆపితే మించిదని సూచించారు. ఓ మంత్రి గవర్నర్‌ని కలిశారని, ఇంకో మంత్రి కాబోయే సీఎంనని సోషల్ మీడియాలో పెట్టుకుంటున్నారన్నారు.

**హైడ్రా ఎఫెక్ట్‌తో రియల్ ఎస్టేట్ ధమాల్..**

సీఎం చిట్‌చాట్‌లో మాట్లాడి కుర్చీకి ఉన్న గౌరవం తగ్గించారని హరీశ్ రావు మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి అబద్ధాలు చూసి గోబెల్స్ కూడా సిగ్గుపడుతారన్నారు. రేవంత్ మాట్లాడితే ఎక్కడ ఆ దుర్భాష విని పిల్లలు చెడిపోతారోనని, ఇండ్లల్లో తల్లిదండ్రులు టీవీలను బంద్ చేస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు మూడువైపులా సముద్రం ఉందంటారని, అలా అయితే గోవా వెళ్లడం ఎందుకని జోకులు వేస్తున్నారన్నారు. రాజీవ్ కంప్యూటర్ కనిపెట్టాడని అంటాడని, దిల్‌సుఖ్‌నగర్‌లో విమానాలు అమ్ముతారన్నారని చెప్పారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ఇలా మాట్లాడుతూ పోతే.. గ్రూప్1 పరీక్ష రాసేవాళ్లు ఏమైపోవాలి? అన్నారు. మల్లన్నసాగర్ బాధితులకు ఒక్క ఇల్లూ కట్టలేదని తప్పుగా మాట్లాడారని, మల్లన్నసాగర్‌కు 50వేల ఎకరాలు కాదు.. 17వేల ఎకరాలేనన్నారు. 14వేల ఎకరాలు ప్రభుత్వ పట్టా అసైన్డ్ భూమి, 3వేల ఎకరాలు ఫారెస్ట్ భూమి అని చెప్పారు. ఏడు గ్రామాలు ముంపునకు గురైతే 14 గ్రామాలు అయ్యాయని తెలిపారు. సీఎం ఇలా మాట్లాడుతూ పోతే ఇక ఆయన మాటలను ఎవరూ నమ్మరన్నారు. తాను కొడంగల్‌లో ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటానని, సన్యాసం తీసుకోకుండా ఎంపీకి ఎందుకు పోటీశారని నిలదీశారు. హైడ్రా ఎఫెక్ట్‌తో రియల్ ఎస్టేట్ రంగం ధమాల్ ధమాల్ అయ్యిందన్నారు. రేవంత్ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే తప్పుడు కేసులు పెట్టున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపైనే కాకుండా ప్రశ్నించే గొంతులపైనా కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. పాదయాత్రకు తాను సిద్ధమని, మూసీ దగ్గరి నుంచే బయలుదేరుతామని సీఎంకు సవాల్ విసిరారు. రేపా? ఎల్లుండా చెప్పాలని.. కేటీఆర్, తాను ఇద్దరం వస్తామన్నారు.

# సర్కార్ ఉద్యోగులకు డీఏ పెంపు

- 3. 64 శాతం పెంచుతూ నిర్ణయం
- పెరిగిన డీఏ 2022 జూలై 1వ తేదీ నుంచి వర్తింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- నవంబర్ జీతంతో కలిసి పెరిగిన డీఏ చెల్లింపు

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం దీపావళి పండుగ సందర్భంగా గుడ్ న్యూస్ చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగులకు 3.64 శాతం కరువు భత్యం(డీఏ) పెంచుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2022 జులై 1వ తేదీ నుంచి డీఏ పెంపు వర్తిస్తుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. నవంబర్ జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లించనున్నారు. 2022 జూలై 1వ తేదీ నుంచి 31 అక్టోబర్ 2024వరకు డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఇటీవల కేబినెట్ సమావేశంలో ఉద్యోగులు, పెన్షనర్ల డీఏ పెంపుపై నిర్ణయం తీసుకున్నారు. తాజాగా ప్రభుత్వం ఈ నిర్ణయం మేరకు డీఏ పెంపుపై జీవోలు 120, 121 జారీ చేసింది. మార్చి 31, 2025వ తేదీ లోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులకు డీఏ బకాయిలను 17 సమాన వాయిదాల్లో చెల్లిస్తామని ప్రభుత్వం తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది.


**డీఏ బకాయిలు...**

అలాగే సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు 10 శాతం ప్రాన్ ఖాతాకు జమచేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. మిగిలిన 90 శాతం వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించనున్నారు. జీపీఎఫ్ ఖాతాలు లేని ఫుల్ టైం కంటింజెంట్ ఉద్యోగులకు వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో డీఏ చెల్లింపులు చేపట్టనున్నారు. 2025 జనవరి నుంచి రిటైర్డ్ ఉద్యోగులకు 17 సమాన వాయిదాల్లో డీఏ బకాయిలు చెల్లించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో తెలిపింది.

# ముగ్గురు ఐఏఎస్‌లపై ఈడీకి ఫిర్యాదు

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

ప్రభుత్వ , భూదాన్ భూములను అప్పనంగా తక్కువ ధరకే ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్‌పై ఈడీ విచారణ వేగవంతం చేసింది. అయితే, ఆ ఘటన మరువక ముందే తాజాగా.. అమోయ్ కుమార్‌తో సహా ఐఏఎస్ నవీన్ మిట్టల్, మాజీ సీఎస్ సోమేష్ కుమార్‌లపై కొండపూర్ వాసులు ఈడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కొండాపూర్ ప్రాంతంలోని మీజీద్ బండీలో ఉన్న 88 ఎకరాలను బాలసాయి ట్రస్ట్‌కు ఓ కుటుంబం దానం చేసింది. కాగా, ట్రస్ట్ భూమిపై కన్నేసిన అధికారులు అదే భూమిలో నుంచి భూపతి అసోసియేట్స్ అనే



ప్రైవేటు సంస్థకు కేటాయిస్తూ అక్రమంగా జీవో నెం.45ను జారీ చేశారని బాధితులు ఈడీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తమ భూమికి సంబంధించి ముగ్గురు ఐఏఎస్‌లు ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



# రాష్ట్రంలో కాంగ్రెస్ అవినీతి పాలన

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిమయమైన పరిపాలన సాగిస్తుందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మహేశ్వర్ రెడ్డి.. కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో అవినీతి, వసూళ్లు విచ్చలవిడిగా జరుగుతున్నాయని, అదే సమయంలో అడ్మినిస్ట్రేషన్ మాత్రం సరిగ్గా కొనసాగడం లేదని దుయ్యబట్టారు. తెలంగాణలో అన్ని అంశాలు అవినీతిమయమయ్యాయని ఆరోపించారు. జీవోలను కూడా పబ్లిక్ డొమైన్ లో పెట్టడం లేదన్నారు. కేవలం ఢిల్లీకి వందల కోట్ల చెల్లించేందుకు వసూళ్లు చేయడమే తప్పా ప్రజలకు ఇచ్చిన హామీలపై ధ్యాస లేదన్నారు. రూ. 1150 కోట్ల సివిల్ సప్లయ్ కుంభకోణంలో ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా, అక్రమాలకు పాల్పడిన మిల్లర్ల నుంచి రికవరీ చేయకుండా మళ్లీ ధాన్యం అప్పగిస్తున్నారన్నారు. దీని వెనుక చీకటి ఒప్పందం ఏమిటని నిలదీశారు. ఇందులో సీఎంకు, సివిల్ సప్లయ్ మంత్రుల ప్రమేయం ఏమిటని ప్రశ్నించారు.

**మంత్రి రికవరీ ఎందుకు చేయడం లేదు...?**

రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, అభివృద్ధి పనుల పేరుతో కాంట్రాక్టులు, కమిషన్ల దందా సాగుతోందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పాలకులు మిల్లర్ల నుంచి భారీ ఎత్తున ముడుపులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు వ్యవహారంలో జీవో ఎంఎస్ 27 తీసుకొచ్చి అక్రమాలకు పాల్పడిన మిల్లర్లకే బ్యాంకు గ్యారంటీలు ఇవ్వడం వెనుక మతలబు ఏమిటో చెప్పాలని బీజేపీ డిమాండ్ చేస్తుందన్నారు. రూ. 20 వేల కోట్ల ధాన్యం మిల్లర్ల నుంచి రావాల్సి ఉందని చెప్పిన సివిల్ సప్లయ్ మంత్రి రికవరీ ఎందుకు చేయడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై కేంద్రానికి ఫిర్యాదు చేస్తామని, ప్రజాక్షేత్రంలో పోరాడుతామని చెప్పారు. బీఆర్ఎస్ పాలనా విధానాలనే అనుసరిస్తూ వందల కోట్ల దోపిడికి కాంగ్రెస్ పాలకులు పాల్పడుతున్నారన్నారు. మిల్లర్లు, కాంట్రాక్టర్ల డీ ఫిల్టర్ల లిస్టును బయటపెట్టమంటే ప్రభుత్వం బయట పెట్టడం లేదన్నారు. సన్న బియ్యం నిబంధనల అమలు సాధ్యం కాదని మిల్లర్లు చెప్పినా ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూడటం లేదన్నారు.

## గ్రూప్-3 పరీక్షల షెడ్యూల్ రిలీజ్

- నవంబర్ 17,18 తేదీల్లో పరీక్షలు
- 10వ తేదీ నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్
- టీజీపీఎస్సీ ప్రకటన

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

తెలంగాణలో గ్రూప్3 అభ్యర్థులకు రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్ పీఎస్సీ) కీలక అప్‌డేట్ అందించింది. నవంబర్ 17 , 18 తేదీల్లో జరగనున్న పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను కమిషన్ విడుదల చేసింది. పరీక్షలకు వారం రోజుల ముందు హాల్ టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. వచ్చే నెల 10 నుండి గ్రూప్ 3 హాల్ టికెట్స్ డౌన్ లోడ్ చేసుకునే అవకాశం ఉంది. అలాగే, టీఎస్ పీఎస్సీ గ్రూప్3 మోడల్ ఆన్సర్ బుక్‌లెట్‌లు అధికారిక వెబ్‌సైట్ https://websitenew.tspsc.gov.in/లో అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 1388 గ్రూప్3 పోస్టులను భర్తీ చేయనున్నారు. వివరాల్లోకి వెళ్తే, TSPSC గ్రూప్3 ఉద్యోగ ప్రకటనలో మొదట 1363 పోస్టులతో 2022 డిసెంబర్ 30న నోటిఫికేషన్ విడుదలైంది. తరువాత అదనంగా 13 పోస్టులు చేరడంతో మొత్తం పోస్టుల సంఖ్య 1375కి పెరిగింది. నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ కార్యాలయంలో 13 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని గుర్తించడంతో మొత్తం కొలువుల సంఖ్య 1388కి చేరింది. ఈ పోస్టులకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5,36,477 మంది దరఖాస్తు చేశారు. టీజీపీ ఎస్సీ తాజాగా సబ్జెక్టుల వారీగా పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది , మోడల్ ఆన్సర్ బుక్‌లెట్‌లు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. టీజీపీ ఎస్సీ గ్రూప్3 పరీక్షలో మొత్తం 3 పేపర్లు ఉంటాయి, ఒక్కో పేపరుకు 150 మార్కుల చొప్పున 450 మార్కులకు పరీక్ష నిర్వహించబడుతుంది. ప్రతి పేపరును రాయడానికి రెండున్నర గంటల సమయం ఉంటుంది. అభ్యర్థులు మూడు పేపర్లు రాయాల్సి ఉంటుంది, ప్రతి పేపర్‌లో 150 ప్రశ్నలు ఉంటాయి, ఒక్కో ప్రశ్నకు 1 మార్కు ఉంటుంది. ఈ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఇంటర్వ్యూ ఉండదు. రాత పరీక్షలను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో నిర్వహించబడతాయి.

# నేడు స్కందగిరికి రానున్న శ్రీరామ యంత్ర రథయాత్ర



**ప్రజాభూమి ప్రతినిది, సికింద్రాబాద్:**

తిరుపతిలో ఈనెల 27న కంచి పీఠాధిపతి ప్రారంభించిన శ్రీరామ యంత్ర రథయాత్ర ఈనెల 31న సాయంత్రం సికింద్రాబాద్ స్కందగిరి శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయ సన్నిధానానికి చేరుకోనుంది. ఐదు రాష్ట్రాల గుండా వెళ్ళే ఈ రథయాత్ర నవంబర్ 16న అయోధ్య క్షేత్రానికి చేరుకుంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భాన్ని పురస్కరించుకొని నవంబర్ ఒకటిన ఆలయంలో ప్రత్యేక పూజలు, సద్గురు శ్రీ త్యాగరాజ కీర్తనలు, విష్ణుసహస్ర పారాయణం, వేదపఠనం, శ్రీరామదాసు కీర్తనలు, తిరుప్పావై, నామసంకీర్తనలు, ఆలయ ఆవరణలో రథయాత్ర ఊరేగింపు ఉంటుందన్నారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరుకానున్నారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరై స్వామి వారి కరుణ కటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ వర్గాలు విజ్ఞప్తి చేశాయి.

# పెట్రోల్ బంక్ ని ప్రారంభించిన ఎమ్ ఎల్ ఎ కవ్వంపల్లి



**ప్రజాభూమి ప్రతినిధి, తిమ్మాపూర్:**

తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ లోని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్, డీజిల్ బంక్ ను ఈ రోజు మానకొండూరు ఎం ఎల్ ఎ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు అనంతరం ఎమ్ ఎల్ ఎ మాట్లాడుతూ రైతులకోసమే సహకార సంఘాలు పని చేస్తాయి అని రైతులు తప్పకుండా వినియోగించుకోవాలని అన్నారు సహకరసంఘాల ద్వారా నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులకు వచ్చే లాభాలు వాటదారులకు చెందుతాయి కాబట్టి ముందుండి నడిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో కరీంనగర్ కే డీ సి సి బ్యాంక్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు పి ఎ సి ఎస్ నుస్తులపూర్ చైర్మన్ రవీందర్ రెడ్డి, మరియూ డైరెక్టర్లు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరేపల్లి రమణా రెడ్డి కాంగ్రెస్ నాయకులు ఎస్ ఎల్ గౌడ్,కొండల్ రావు, శ్రీనివాస్ రావు,గోగునూరి నరసింహ రెడ్డి,కొత్త తిరుపతి రెడ్డి, బుదారపు శ్రీనివాస్,బండారి రమేష్,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్టం చేయాలి






**ప్రజాభూమి ప్రతినిధి, వేములవాడ:**

ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీస్ విధులు ఉండాలని,దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విజిబుల్ పోలీసింగ్ పై దృష్టిసారించాలని,విలేజ్ పోలీస్ అధికారులు స్టేషన్ పరిధిలోని గ్రామాలు,వార్డులు పర్యటిస్తూ ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్టం చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ అధికారులు,సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని,పెండింగ్లో ఉన్న కేసులు,పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు,శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న జాగ్రత్తలపై అధికారులను అడిగి తెలుసుకొని, పెండింగ్ ఉన్న కేసులపై రివ్యూ చేసిన జిల్లా ఎస్పీ. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో 5s అమలు చేసిన తీరు,విధులు నిర్వహిస్తున్న సిబ్బంది యొక్క డ్యూటీల గురించి అడిగి తెలుసుకుని,రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర అన్ని విభాగాలు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సిబ్బంది తో మాట్లాడుతూ... అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని, పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. అధికారులు, సిబ్బంది విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా తరచు గ్రామాలు, వార్డులు పర్యటిస్తూ ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నతాధికారులు తెలిసేలా ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్టం చేయాలన్నారు.దక్షణకాశిగా పేరుగాంచిన వేములవాడ పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా, వివిధ ప్రాంతాల నుండి శ్రీ రాజరాజేశ్వర దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా విజిబుల్ పోలీసింగ్ అమలు చేస్తూ, స్టేషన్ పరిధిలోని రౌడి షీటర్స్,హిస్టరీ షీటర్స్,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా కఠినతరం చేయాలన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీ డ్రంక్ అండ్ డ్రైవ్ లు ఏర్పాటు చేయాలని, గంజాయి కిట్ల సహాయంతో అనుమానిత వ్యక్తులకు టెస్ట్ లు నిర్వహించాలని,జిల్లాలో గంజాయి నివారణకు పకడ్బందీగా చర్యలు చెపడుతున్నామని,గంజాయి కి సంబంధించిన సమాచారం సబంధిత పోలీస్ వారికి లేదా, డయల్ 100 కి సమాచారం అందించాలన్నారు.అధికారులకు,సిబ్బంది కి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలి అని సూచించారు.ఎస్పీ వెంట ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి,పట్టణ సి.ఐ వీరప్రసాద్, ఎస్.ఐ లు రమేష్, రాజు, సిబ్బంది ఉన్నారు.

# రాసి సీడ్స్ పత్తి ప్రదర్శన క్షేత్రం




**ప్రజాభూమి ప్రతినిది వేములవాడ:**

వేములవాడ తిప్పపూరం గ్రామానికి చెందిన నీలం శ్రీనివాస్ అనే రైతు చేనులో రాసి స్విఫ్ట్ బిజీ 2 రకం పై అవగాహన కల్పిస్తూ తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడి ఇచ్చే పత్తి రకం అని అలాగే పచ్చ దోమ తెల్ల దోమ పేను బంక తామర పురుగులను సమర్థవంతంగా తట్టుకుంటుంది అని వివరించారు. ఈ కార్యక్రమంలో రాశి కంపెనీ ఆర్ బి ఎం ప్రదీప్ టి ఎస్ ఎం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెట్టిన రాసి షిఫ్ట్ రకం అన్ని నెలకు అనుకూలమైన రకం తక్కువ రోజుల్లో పంట చేతికి వస్తుంది ఆకు సైజు చిన్నగా ఉండడం వలన అధిక వర్షాలు పడిన కాయ కుళ్ళిపోకుండా ఉంటుంది ఆకుపై ముల్లు ఉండడం వలన తెల్ల దోమ పచ్చ దోమ ను సమర్థవంతంగా తట్టుకుంటుంది అదేవిధంగా ముందు క్రాప్ రావడం వలన నవంబర్ డిసెంబర్ లో వచ్చే గులాబీ రంగు పురుగును తప్పించుకుంటుంది ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అధిక దిగుబడిని పొందాలనుకుంటే రాశి షిఫ్ట్ రకాన్ని పెట్టాలని కంపెనీ ప్రతినిధి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాసి సీడ్స్ ఆర్ బీ ఎమ్ ప్రదీప్ కుమార్ టీ ఎస్ ఎమ్ వెంకటరమణ రెడ్డి ,డిస్ట్రిబ్యూటర్ జనార్ధన్ రెడ్డి మరియు కార్తికేయ, డీలర్లు మరియు పీ ఓ లు శ్యామ్, రాజశేఖర్ రెడ్డి, రాజేష్ చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న 350 మంది రైతులు పాల్గొన్నారు.

# చెత్తను తొలగించాలని కాలనీవాసుల విజ్ఞప్తి

**ప్రజాభూమి ప్రతినిది, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని పాత మార్కెట్ ఏరియాలో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. మున్సిపల్ సిబ్బంది వెంటనే స్పందించి చెత్తను తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

చెత్త ద్వారా వచ్చే దోమల ద్వారా కాలనీవాసులు అనారోగ్య బారిన పడుతున్నామని, ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి, దోమలు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



# శ్రీవెంకటేశ్వర బేలర్స్ యూనియన్ అధ్యక్షుడిగా పత్తెం రాజు



**గడ్డి కట్టకు 35రూపాయలుగా తీర్మానం.**

**ప్రజాభూమి ప్రతినిది, చిగురుమామిడి:**

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలోని శ్రీవెంకటేశ్వర బేలర్స్ అసోసియేషన్ యూనియన్ ఎన్నికలను బుధవారం నిర్వహించారు.అధ్యక్షులుగా పత్తెం రాజు,ఉపాధ్యక్షులుగా గండికోట రాయమల్లు,క్యాషియర్ గా గూళ్ళ అనిల్,ప్రచార కార్యదర్శిగా మౌటం రాజు,శ్రీమూర్తి శ్రీనివాస్ ను ఎన్నుకున్నారు.తన ఎన్నికకు సహకరించిన యూనియన్ సభ్యులకు రాజు ధన్యవాదాలు తెలియజేశారు.యూనియన్ సభ్యులకు ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా ముందుండి పరిష్కారం కోసం కృషి చేస్తానని రాజు తెలిపారు.దారం రేటు పెరగడంతోపాటు బేలర్ సమన్ రేట్లు పెరగడం వల్ల గడ్డి కట్టల రేట్లు పెంచినట్లు వారు పేర్కొన్నారు.గడ్డి కట్టకు 35రూపాయలుగా సమావేశంలో నిర్ణయించడం జరిగిందని వారు తెలిపారు.పెరిగిన ధరలకు అనుగుణంగా కట్టకు 35రూపాయలు ఇచ్చి సహకరించాలని రైతులను కోరారు.ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పెసరి రాధాకృష్ణ, మౌటం మల్లేష్,పత్తెం రాజశేఖర్,జీల ఐలయ్య, గండికోట శ్రీకాంత్,పత్తెం శ్రీనివాస్,బాలయ్య,పిట్టల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ మండల మాల మహానాడు నూతన కమిటీ నియామకం



**ప్రజాభూమి ప్రతినిధి, తిమ్మాపూర్:**

తిమ్మాపూర్ మండలం మహాత్మనగర్ గ్రామంలోని లక్ష్మి నరసింహ స్వామీ కళ్యాణమండపంలో బుధవారం జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కాడే శంకర్ ప్రధాన కార్యదర్శి ఎలుక ఆంజనేయులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెడి అంజయ్య ఆద్వర్యంలో జరిగిన తిమ్మాపూర్ మండల మాల మహానాడు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది మండల అధ్యక్షులుగా ఎలుక రాజు,ప్రధానకార్యదర్శి కర్ర మణికంఠ గౌరవ అధ్యక్షులుగా బూడిద వినోద్ ఉపాధ్యక్షులుగా మల్క రవి,దొంత తిరుపతి,లింగం కుమార్, మల్కల రాజ్కుమార్, కోశాధికారులు బురుగు అంజయ్య,గౌరవ సలహాదారు మామిడి అనిల్,సుంకే నరేందర్,సోషల్ మీడియా మండల కన్వీనర్ ఎలుక శ్రీధర్,కార్యవర్గ సభ్యులుగా బాబు,రమేష్,కృష్ణ,తిరుపతి,కిరణ్,ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా మీద నమ్మకం ఉంచి ఎన్నుకున్న రాష్ట్ర మరియూ జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మెడి మహేష్, తాళ్ళ వెంకటేష్, గంట శ్రీనివాస్,యాదగిరి,సత్యం,నాయకులు కమలాకర్,కనుకయ్య,శ్రీనివాస్,లక్ష్మణ్,తిరుపతి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయంలో ఉద్యోగుల పదవీవిరమణ



**ప్రజాభూమి ప్రతినిది, వేములవాడ:**

రాజన్న ఆలయ ఉద్యోగ వర్గం లో శ్రీ పెద్దిరెడ్డి భూంరెడ్డి గారు, జూనియర్ అసిస్టెంట్, శ్రీ కొండం శ్రీనివాస్ రెడ్డి గారు, జూనియర్ అసిస్టెంట్ ,శ్రీమతి కె. మంగమ్మ గారు స్వీపర్, శ్రీ నారవేని కిషన్ గారు స్వీపర్ విధులు నిర్వర్తిస్తూ ఈరోజు పదవీవిరమణ సందర్భంగా , లను ఈఓ వినోద్ రెడ్డి గారు శాలువతో సత్కరించారు అనంతరం ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలోని ఓపెన్ స్లాబ్ యందు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో మొదటగా అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు తదుపరి ఆలయ ఉద్యోగుల సంఘం కార్యదర్శి కూరగాయల శ్రీనివాస్ మరియు ఏ ఈ ఓ లు శ్రావణ్, జయకుమారి, శ్రీనివాస్ లు మరియు ఆలయ ఉద్యోగులు పదవీవిరమణ చెందిన ఉద్యోగులకు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై ఎన్యుమరేటర్లకు శిక్షణ



**ప్రజాభూమి ప్రతినిధి, గన్నేరువరం:**

గన్నేరువరం మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, మరియు కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) పై సర్వే చేపట్టవలసిన ఎన్యుమారెటర్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రామాంజనేయ చారి, తాసిల్దార్ ఇప్ప నరేందర్, ఎంపీడీవో శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ శ్రీధర్, సూపర్వైజర్ లు, పంచాయతీ కార్యదర్శులు, వివోఎ లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఎఫ్ ఎలు, ఆశావర్కర్లు ,కారోబర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దు






**విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యం - బెజ్జంకి ఎస్సై కృష్ణారెడ్డి**

**ప్రజాభూమి ప్రతినిది, బెజ్జంకి:**

కేజీబీవీ బెజ్జంకి విద్యార్థిని విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీటీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి, షీటీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాల గురించి, ర్యాగింగ్/ ఇవిటీజింగ్/పోక్సో/షీటీమ్స్/యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు,నూతన చట్టాల గురించి, మరియు అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్ మరియు మాటలు నమ్మవద్దని,సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందని బెజ్జంకి ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం అని మహిళల భద్రత మా ముఖ్య బాద్యత అని,చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దు అన్నారు,ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని,పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలని మరియు సామాజిక రుగ్మతల గురించి సెల్ ఫోన్ కు ఎంత దూరం ఉంటే అంత మంచిదని,ఫోన్ వల్ల ఎంత మంచి ఉందో అంత చెడు ఉంది దానికి అలవాటు పడి బానిసలు కావద్దని,విద్యార్థి దశ చాలా కీలక కష్టపడే తత్వం కష్టపడి చదువుకోవడం చాలా ముఖ్యమని మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మరియు అవహేళనగా మాట్లాడిన వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షీటీమ్ నెంబర్ 8712667434 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. మరియు నూతన చట్టాల గురించి నూతన చట్టాలలో మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరిగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్ రావు, సిద్దిపేట షీటీమ్ బృందం కిషన్, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు మమత,వీణకుమారి,కానిస్టేబుళ్లు ప్రవీణ్, లక్ష్మీనారాయణ,స్కూల్ స్పెషల్ ఆఫీసర్ శ్వేత, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న మహిళ అఘోరి



**ప్రజాభూమి ప్రతినిది, వేములవాడ:**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని మహిళ అఘోరి దర్శించుకున్నారు. దర్శనంతరం బయటకు వస్తూ మీడియాతో మాట్లాడారు. రేపు సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి దగ్గర ఎం జరుగబోతుందో మీరు చూస్తారు వేములవాడ రాజన్న గుళ్ళో ఉన్న దర్గా ను తీసివేస్తే నే మీరు హిందువులు అవుతారని, హిందూ సమాజం బాగు పడుతుందన్నారు. దర్గా తీసేవేసేందుకు నేను నా ప్రయత్నం చేస్తానాని తెలిపారు. ఒకప్పుడు కాశీలో ఉండేనాని ఇప్పుడు లేవు అన్నారు. అసలు రాజన్న గుళ్ళో దర్గా దారిద్ర్యం అవసరమా చిపిరితో కొట్టించుకోవడం అని వెంటనే తొలగించాలని అన్నారు. కాని నేను ముస్లింలను తప్పు పట్టడం లేదన్నారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి దగ్గర రేపు ఎం జరుగబోతుందో మీరు చూస్తారు కదా అంటూ 5 లీటర్ల పెట్రోల్ డబ్బాతో వాహనం లో వెళ్లిపోయారు.

## ఘనంగా లక్ష్మీ కుబేర వ్రతం



**ప్రజాభూమి ప్రతినిధి, సికింద్రాబాద్:**

భక్తి శ్రద్ధల నడుమ లక్ష్మీ కుబేర వ్రతం బుధవారం ఘనంగా జరిగింది. ప్రతీ సంవత్సరం దీపావళి ముందు ధన త్రయోదశి నాడు సికింద్రాబాద్ జవహర్ నగర్ కాలనీలో గల రామాలయంలో నిర్వహించే లక్ష్మీ కుబేర వ్రతాన్ని జంట నగరాల నుండి మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొంటారు. ఈ వ్రత కార్యక్రమంలో పాల్గొన్న రాంగోపాల్ పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ మాట్లాడుతూ.... ధన త్రయోదశి నాడు నిర్వహించే ఈ వ్రతం వల్ల సకల సౌభాగ్యాలు కలుగుతాయని విశ్వాసమన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిని 250పడకల ఆసుపత్రిగా మారుస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు..

**చిగురుమామిడిలో సీఎం,మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు.**
**82కోట్ల రూపాయలను విడుదల చేయటంపై హర్షం.**

**ప్రజాభూమి ప్రతినిధి, చిగురుమామిడి:**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని 100పడకల ఆసుపత్రి నుండి 250పడకు ఆసుపత్రిగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు చిగురుమామిడి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి తెలిపారు.250పడకల ఆసుపత్రిగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల బుధవారం చిగురుమామిడి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు పలువురు మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు.ఈ సందర్భంగా కంది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ 250పడకల ఆసుపత్రిగా మార్చడానికి 82కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు.మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ శాసనసభ్యులుగా ఎన్నిక అయ్యాక నియోజకవర్గం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని తిరుపతి రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు .250పడకల ఆసుపత్రిగా మార్చడానికి అహర్నిశలు



కృషి చేసిన రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు తిరుపతి రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.హుస్నాబాద్ కు 250పడకల ఆసుపత్రి రావడం పట్ల చిగురుమామిడి మండల ప్రజలు,కార్యకర్తలు,నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే హుస్నాబాద్ నియోజకవర్గానికి అతి తక్కువ సమయంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఈ ప్రాంత ప్రజలు ఎప్పుడు రుణపడి ఉంటామని పలువురు చెబుతున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చిట్టుమల్ల రవీందర్,మహిళా మండల అధ్యక్షురాలు పోలు స్వప్న, గ్రామ శాఖ అధ్యక్షులు వంగ కనకయ్య,మాచమల్ల రమణయ్య,ఎనగందుల లక్ష్మణ్, కూతుబుద్దిన్,వడియాల సుధాకర్ రెడ్డి,నాయకులు సాంబారి బాబు,మాచమల్ల కిషోర్,సంజీవ్,పొన్నం సంపత్,పూల లచ్చిరెడ్డి,రమేష్, పోటు సంజీవరెడ్డి,కోనేటి నారాయణ,రవీందర్ గౌడ్,వడియాల సంతోష్ కుమార్,బుర్ల కుమార్,తదితరులు ఉన్నారు.

## తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఎన్నిక



**ప్రజాభూమి ప్రతినిధి, సిర్పూర్:**

సిర్పూర్ నియోజకవర్గ బి.ఆర్.ఎస్ నాయకులు ట్రేడ్ యూనియన్ లో అనుభవం కలిగి కార్మికుల హక్కుల సాధన కొరకు పోరాడుతున్నా వ్యక్తి అంబాల ఓదెలు గారిని తెలంగాణ సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘానికి బెల్లంపల్లి ఏరియా అధ్యక్షులుగా నియమించినందుకు టీ బీ జీకే ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి గారికి, మరియు బి,ఆర్,ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ గారికి బెల్లంపల్లి ఏరియా టీ బీ జీకే ఎస్ ఉపాధ్యక్షులు మల్రాజ్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలియజేసారు,కాగజనగర్ లో బి ఆర్ ఎస్ నాయకులు ఓదెలు గారికి సన్మానం చేశారు ఈ కార్యక్రమం లో సిర్పూర్ నియోజకవర్గ బి.ఆర్. ఎస్ నాయకులు అభినందనలు తెలియజేశారు. మా ప్రాంత బి,ఆర్,ఎస్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఓదెలు గారికి సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘంలో సముచిత స్థానం కల్పించి మాకు దీపావళి కానుక అందజేశారని వారికి అభినందనలు తెలియజేశారు. ఓదెలు గారి నాయకత్వంలో సింగరేణి ప్రాంతంలో కార్మిక ఉద్యమం బలపడుతుందన్నారు. కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గ బి,ఆర్,ఎస్ లెండ్గురే శ్యామ్ రావు, తెలంగాణ ఉద్యమ నాయకులు మోహిన్, సి.పి రాజ్ కుమార్, మహిళా నాయకురాలు మౌల్కర్ లలిత, బినాజి ,మున్సిపల్ కౌన్సిలర్ మినాజ్, మాజీ కౌన్సిలర్ నక్క మనోహర్,దాసరి నరెందర్, అంజన్న బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ

**(మొదటి పేజీ తరువాయి)**

లేకుండా చేస్తానని రేవంత్ రెడ్డి అంటున్నారని పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. కేసీఆర్ పేరు తలచుకోకుండా నీ ఒక్క మీటింగ్ అన్నా అయ్యిందా అని ప్రశ్నించారు ఎవడో పెయింటర్ గోడల మీద రాసింది తుడిపేస్తే చెరిగేపోయే పేరు కాదని అన్నారు. తెలంగాణ ప్రజల గుండెలకు అతుక్కుపోయిన పేరు కేసీఆర్ అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రిగా ఒక గొప్ప అవకాశం వచ్చిందని అన్నారు. దాన్ని వినియోగించుకుని ప్రజలకు మంచి చేయాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ఒక్క వర్గమైనా సంతోషంగా ఉందా అని పాడి కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. దేశంలోనే రైతులకు రూ.2 లక్షల కోట్లు ఖర్చు పెట్టిన ఏకైక సీఎం కేసీఆర్ అని పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. పదేళ్ల క్రితం హైదరాబాద్ ఎలా ఉండేది? ఇప్పుడు ఎలా ఉంది అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తుగ్లక్ ముఖ్యమంత్రి అని ఎద్దేవా చేశారు. దేశంలోనే ఇలాంటి ముఖ్యమంత్రి లేదు అని విమర్శించారు.

**కౌశిక్ రెడ్డి నీ బండారం బయట పెడతా: బల్మూరి వెంకట్**

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన, గత పది నెలల కాంగ్రెస్ పాలనపై చర్చించేందుకు ఎక్కడికి రమ్మన్నా వస్తానని ఈ చర్చకు పాడి కౌశిక్ రెడ్డి సిద్ధమా అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సవాల్ చేశారు. కౌశిక్ రెడ్డికి రెండు రోజుల సమయం ఇస్తున్నామని





ఫామ్ హౌస్ కు వెళ్లి దొరనే కలుస్తారో లేక ఆ పార్టీలో మరెవరివద్దకైనా వెళ్తారో ఆయన ఇష్టం. ఏ డిపార్ట్మెంట్ అంటే దానిపై చర్చిద్దామని అన్నారు. బుధవారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన ఆయన.. అసలు నీ చరిత్ర, నీ బండారం ఏంటో బయటపెడతానన్నారు. జన్వాడ ఫామ్ హౌస్ డ్రగ్స్ వ్యవహారం కౌశిక్ రెడ్డికి సంబంధించినది కాదని, ఇది కేటీఆర్ కు సంబంధించిందన్నారు. ఈ వ్యవహారంలో కేటీఆర్ సన్నిహితులు ఉన్నారని అందువల్ల కేటీఆర్, రాజ్ పాకాల డ్రగ్ టెస్టుల కోసం శాంపిల్స్ ఇచ్చి వారి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. కేసీఆర్, కేటీఆర్ మెప్పుపొందేందుకు మాట్లాడితే సొంత పార్టీ నేతలే నిన్ను తిట్టే పరిస్థితి వస్తుందన్నారు. రాజకీయం కోసం కౌశిక్ రెడ్డి ఎంతటి నీచానికైనా దిగజారే వ్యక్తి అని ధ్వజమెత్తారు. ఓట్ల కోసం భార్యను బిడ్డను బయటకు తీసుకొచ్చిన చరిత్ర నీదన్నారు.



## సెక్రటేరియట్ బందోబస్తు సెక్యూరిటీ మార్పు

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో విధులు నిర్వహించే బందోబస్తు సెక్యూరిటీ మార్పులు జరిగాయి. ఈ మేరకు తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సచివాలయ భద్రత బాధ్యతలను (టీజీఎస్పీ) ప్రత్యేక పోలీస్ విభాగం స్థానం నుంచి టీజీఎస్పీఎఫ్‌కు అప్పగించింది. కాగా, బెటాలియన్ కానిస్టేబుళ్లు నిరసనలు, ధర్నాల కారణంగా ఇంటెలిజెన్స్ పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఇంటెలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి సెక్యూరిటీలో కూడా తాజాగా మార్పులు చేసిన విషయం తెలిసిందే. సీఎం నివాసం వద్ద ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.అదేవిధంగా తెలంగాణ సచివాలయం చుట్టూ దాదాపు రెండు కిలోమీటర్ల వరకు 144 సెక్షన్ అమల్లో ఉందని చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. సచివాలయం స్టాఫ్ కదలికలు, సోషల్ మీడియాపై అధికారులు నిఘా పెట్టారు. ప్రభుత్వం, పోలీసు శాఖకు వ్యతిరేకంగా ఎలాంటి పోస్టులు షేర్, లైక్ చేయొద్దని సూచించారు. రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వాట్సప్ గ్రూపుల నుంచి ఎగ్జిట్ కావాలని సిబ్బందిని ఆదేశించారు. తప్పు జరిగితే వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఇటీవల హెచ్చరించారు. కాగా, తమ సమస్యలు పరిష్కరించాలంటూ టీజీఎస్పీ పోలీసులు కుటుంబసభ్యులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టిన విషయం విదితమే. దీంతో సెక్యూరిటీ మార్పులు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

# వెలుగుల పండుగ దీపావళి

**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు**
**ప్రజలందరికీ దీపావళి పర్వదిన శుభాకాంక్షలు**

**ప్రజాభూమి ప్రతినిధి, కరీంనగర్:**

ఇంటింటా దీపాలు వెలిగించుకొని సంతోషంగా జరుపుకునే వెలుగుల పండుగ దీపావళి అని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. గురువారం దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఆనంద దీపావళి ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు.

హిందూ సంస్కృతిలో దీపావళి విజయానికి ప్రతీకగా ఆనందోత్సవాల మధ్య జరుపుకుంటామని, మన జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు. సంకల్పం, చైతన్యంతో ముందుకు సాగేందుకు దీపావళి పండుగ స్ఫూర్తినిస్తుందని తెలిపారు. బాణసంచా కాల్చేటప్పుడు ప్రజలంతా తగిన జాగ్రత్తలు పాటించాలని వెలిచాల రాజేందర్ రావు సూచించారు. హిందువులు జరుపుకునే పండుగల్లో అతి ముఖ్యమైన పండుగ దీపావళి అని పే



ర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళిని ప్రజలంతా ఆనంద ఉత్సవాల మధ్య జరుపుకోవాలని రాజేందర్ రావు ఆకాంక్షించారు. దీపావళి పండుగ ప్రజలందరి ఇండ్లలో కొంగొత్త వెలుగులు నింపాలని రాజేందర్ రావు పేర్కొన్నారు.

# మా ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరడం లేదు

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణలో తాము బలహీనవర్గాలకు ప్రాధాన్యం కల్పించామన్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని విమర్శించటమే పనిగా పెట్టుకున్నాయని దుయ్యబట్టారు. బీసీ కులగణన హామీకి కట్టుబడి ఉన్నామని చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో కుల గణనపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి.. బీసీ కుల గణన తెలంగాణలో చరిత్ర సృష్టించబోతోందని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావుకు రైతు రుణమాఫీ గురించి మాట్లాడే కనీస అర్హత లేదని మండిపడ్డారు. ఏడాది తర్వాత బీఆర్ఎస్ పార్టీ ఉండదని కోమటిరెడ్డి జోష్యం చెప్పారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ పని తీరే ఇందుకు కారణమన్నారు.

**మా పార్టీలోకి వస్తామంటున్నారు.. కానీ**

కేసీఆర్ పేరు ఇప్పుడు తెలంగాణలో ఎక్కడా వినపడడం లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. గతంలో తమ పార్టీ ఎమ్మెల్యేలను లాక్కున్న సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న భట్టి విక్రమార్క ఐదుగురు ఎమ్మెల్యేలతో పోరాటం చేశారని గుర్తు చేసారు. అసలు కేసీఆర్ ఫామ్ హౌజ్‌లో ఉన్నాడా? లేడా? అన్న అనుమానాన్ని కోమటిరెడ్డి వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు అసెంబ్లీకి వచ్చే ముఖం లేదని అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు, పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా దూసుకెళ్తున్నామని చెప్పారు. ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాజీ సీఎం కేసీఆర్‌కు టచ్‌లో ఉన్నారంటూ ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ మారిన విషయం తెలిసిందే. ఈ విషయంపై మంత్రి కోమటిరెడ్డి స్పందించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరటం కాదని, బీఆర్ఎస్ నుంచే మరో 20 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో రావడానికి సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యనించారు. కానీ తామే చేర్చుకోవటం లేదని అన్నారు.

## అక్కడ ఇండ్లను ఆక్రమించుకున్న వారిని ఖాళీ చేయించండి

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

నందనవనం లబ్దిదారులకు తెలంగాణ సర్కార్ శుభవార్త వెల్లడించింది. ఈ మేరకు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఎక్స్ ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్ట్ చేశారు. రంగారెడ్డి జిల్లా ఎల్.బీ.నగర్ నియోజకవర్గం పరిధిలోని నందనవనంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఇండ్లను అక్రమంగా ఆక్రమించుకున్నవారిని తక్షణం ఖాళీ చేయించి అర్హులైన వారికి అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. 'నందనవనం' ఆక్రమణదారుల తొలగింపునకు చర్యలు చేపట్టి.. అర్హులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలో మహేశ్వరం నియోజకవర్గంలోని మంకాల్, నందనవనంలో ఉన్న ఇండ్ల సమస్య, కేటాయింపుపై అధికారులతో సమావేశం నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధప్రకాష్, ప్రజావాణి నోడల్ ఆఫీసర్ డి. దివ్య, ప్రస్తుత రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్లుగా పని చేసిన డాక్టర్ ఎస్. హరీష్, కె. శశాంక్ తదితరులు పాల్గొన్నట్లు ట్వీట్ లో తెలిపారు.

# ఆహ్లాదం దరిచేరేలా.. ఆనందం పంచేలా..



**ప్రజాభూమి ప్రతినిధి, పరిగి, వికారాబాద్ కలెక్టరేట్:**

నేడు మనిషి జీవనం యాంత్రికంగా మారింది. ఉదయం లేచింది మొదలు నిద్రపోయే వరకు ఒకటే పరుగు.. కనీసం వారాంతాల్లోనైనా కుటుంబంతో ఆహ్లాదంగా గడిపేందుకు వసతులు లేవు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు అడవులను చరవాణుల్లో చూపుతున్నారు. ఇవన్నీ కళ్లముందు సహజసిద్ధంగా సాక్షాత్కరిస్తే అద్భుతంగా ఉంటుంది కదూ. అర్బన్ పార్కుల ఏర్పాటుతో వీటిని ప్రారంభించేందుకు అటవీశాఖ కార్యాచరణ చేపట్టింది. జిల్లా వాసులకు ఆహ్లాదాన్ని అందించేందుకు ఇవి అందుబాటులోకి రానున్నాయి. హెచ్ఎండీఏలోని అర్బన్ ఫారెస్ట్రీ విభాగం, నగర్వన్ యోజన పథకం కింద అటవీశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. క్షేత్రస్థాయిలో ఇప్పటికే పనులు ప్రారంభించిన అధికారులు వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఒక్కో పార్కుకు రూ.2కోట్ల చొప్పున మంజూరయ్యాయి. వ్యవసాయ ప్రాంతంగా ఉన్న జిల్లాను అభివృద్ధి చేసేందుకు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు ఇందుకు వినియోగిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో వనరుల సద్వినియోగానికి పోటీపడుతున్నారు.

ఎక్కడెక్కడ అంటే..: పరిగి మండలం జాఫర్‌పల్లి రిజర్వు ఫారెస్టులో 50హెక్టార్లు, కొడంగల్ పరిధి అప్పాయిపల్లిలో 180 హెక్టార్లు, వికారాబాద్ అనంతగిరిలో 80హెక్టార్ల చొప్పున ఏర్పాటు కానున్నాయి. వీటితో పాటు తాండూరులోని గొల్లపల్లిలో గతేడాది మంజూరైన పార్కు పనులు ఇప్పటికే 20శాతం పూర్తయ్యాయి. మిగతా ప్రాంతాల్లోనూ పార్కుల ఏర్పా



టులో భాగంగా మొక్కల పెంపకం పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి.

**వసతులు ఇలా:** జాఫర్‌పల్లిలో 3.5 కి.మీ దూరం, అప్పాయిపల్లిలో 6కి.మీ, అనంతగిరిలో 6కి.మీ తాండూరులో 4కి.మీ చొప్పున పాదచారులను ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేయనున్నారు. శౌచాలయాలు, తాగునీరు, సందర్శకులు అడవి అందాలను ఆస్వాదించేందుకు వాచ్‌టవర్లు, వాహనాల పార్కింగ్, కూర్చునేందుకు బెంచీలు, సైన్‌బోర్డులు, అక్కడక్కడా పర్కులేషన్ ట్యాంకులు, చెక్‌డ్యాంల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వాటికి రక్షణ కల్పిస్తారు.

# తెలంగాణ వర్సిటీకి మొండి చేయి

**ప్రజాభూమి ప్రతినిధి, నిజామాబాద్:**

మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు వర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు నిర్ణయానికి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. వచ్చే ఏడాది నుంచి తరగతుల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇదే ఉమ్మడి జిల్లాలోని కోస్గి పాలిటెక్నిక్ కళాశాలను ఈ ఏడాదిలోనే ఉన్నతీకరించి ఇంజినీరింగ్ కోర్సులు ప్రారంభించారు. రాష్ట్రం పేరుతో ఏర్పాటైన తెలంగాణ విశ్వవిద్యాలయంలోనూ ఇంజినీరింగ్ కోర్సులు ప్రారంభించేందుకు ప్రతిపాదనలు గతంలోనే వెళ్లాయి. అవి బుట్టదాఖలయ్యాయి. ఈ దుస్థితికి కారణం ఎవరని నిందించడం కంటే.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా విద్యార్థులకు జరుగుతున్న నష్టంపై ఇప్పుడు చర్చ జరగాలి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంత యువత చదువులు సాగించేందుకు ఇందూరునే ఎంచుకొంటోంది. ఇలాంటి తరుణంలో ఈ ప్రాంతానికి ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయాల్సిన ఆవశ్యకతను ఇక్కడి ప్రజాప్రతినిధులు గుర్తెరగాలి.

**ఇందూరుకు అడిగేవారేరి..?**

ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు డిమాండ్



ఇందూరు ప్రాంతంలో చాలా కాలంగా ఉన్నా.. ఎన్నికల సందర్భంలో అన్ని రాజకీయ పార్టీలు ఇచ్చే హామీల్లోనూ ఈ అంశం ఉంటుంది. అమలు చేసిన దాఖలాలు లేవు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం రెండు పర్యాయాలు జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుపై హామీ ఇచ్చారు. ప్రభుత్వ పెద్ద హామీ ఇచ్చినప్పటికీ...అది అమలు జరగాలంటే ఈ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహించే ప్రజాప్రతినిధుల చొరవ కీలకం. వారు శ్రద్ధచూపనిదే అడుగు ముందుకు పడదు. కళాశాల మంజూరు చేయాలంటూ ముఖ్యమంత్రి వద్దకు వెళ్లినప్పుడల్లా గుర్తు చేస్తే ఫలితం ఉంటుంది. కానీ ఆ దిశగా వెళ్లట్లేదు.

**సానుకూలతలున్నా..**

తెలంగాణ వర్సిటీ 570 ఎకరాల సువిశాల ప్రాంగణంలో సైన్స్ అండ్ ఇంజినీరింగ్ కళాశాల భవనం ఇప్పటికే ఉంది. అదీగాక కొత్తగా నిర్మిస్తున్న సైన్స్ భవనం త్వరలోనే అందుబాటులోకి రానుంది. కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకులున్నారు. అవసరమైతే ఇతర కోర్సులకు అతిథి అధ్యాపకులు, ఇతర ప్రాంతాల నుంచి డిప్యుటేషన్లు చేసుకోవచ్చు.

# సామాజిక అసమానతలు పాటించొద్దు

## ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన అవసరం

### ఆర్ఐ భాను ప్రకాష్, ఏఎస్ఐ కృష్ణంరాజు

**ప్రజాభూమి ప్రతినిది, దౌల్తాబాద్:**

సామాజిక అసమానతలు పాటించవద్దని మనుషులందరూ సమానమేనని కులమత బేధాలు పాటిస్తూ వివక్షత చూపిస్తే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని రాయపోల్ ఆర్ఐ భాను ప్రకాష్, ఏఎస్ఐ కృష్ణంరాజు అన్నారు. బుధవారం రాయపోల్ మండలం గొల్లపల్లి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ దళితులందరికీ రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ఎస్సీ ఎస్టీ కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి నెల 30 లేదా 31 తేదీన ఒక్కో గ్రామం చొప్పున పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగం ప్రకారం భారతదేశంలో అందరికీ సమానమైన హక్కులు చట్టాలు కల్పించబడ్డాయన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేని ఒకరు ఎక్కువ ఒకరు తక్కువని భేదం లేకుండా జీవించాలన్నారు. గుడిలో, బడిలో సామాజిక అసమానతలు లేని కుల వివక్ష ఎక్కడ చూపించరాదన్నారు. కులమత బేధాలు లేకుండా మనుషులందరూ సమానమే అని తెలిపారు. ప్రజలకు హక్కులు, చట్టాల మీద పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ద్వారా వచ్చే నిధుల గురించి తెలియజేస్తూ, వాటిని ఉపయోగించుకొని దళిత కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడానికి ఏవిధంగా ఉపయోగించుకోవాలో వివరించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, కాంగ్రెస్ నాయకులు మహేష్, ఆశావర్కర్లు, వివిధ కుల సంఘాల పెద్దలు, యువత పాల్గొన్నారు.





# మనుషులంతా సమానమే

## దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్

**ప్రజాభూమి ప్రతినిధి, దౌల్తాబాద్ :**

దేశంలో మనుషులందరూ సమానమేనని కుల, మత వివక్షత పాటించడం చట్టరీత్య నేరమని, ఎవరైనా అలాంటి సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్, ఆర్ఐ ప్రభాకర్‌రావు అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలం ముబారస్‌పూర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం ప్రభుత్వాలు కల్పిస్తున్న హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించడం కోసం తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆధ్వర్యంలో ప్రతి నెల 30వ తేదీన గ్రామాలలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తుందన్నారు. దళితులందరికీ రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ఎస్సీ ఎస్టీ కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి నెల 30వ తేదీన ఒక్కో గ్రామం చొప్పున పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగం ప్రకారం భారతదేశంలో అందరికీ సమానమైన హక్కులు చట్టాలు కల్పించబడ్డాయన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేని ఒకరు ఎక్కువ ఒకరు తక్కువని భేదం లేకుండా జీవించాలన్నారు. గుడిలో, బడిలో సామాజిక అసమానతలు లేని కుల వివక్ష ఎక్కడ చూపించొద్దన్నారు. కులమత బేధాలు లేకుండా మనుషులందరూ సమానమేనని తెలిపారు. ప్రజలకు హక్కులు, చట్టాల మీద పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎస్సీ, ఎస్టీలకు వచ్చే నిధుల గురించి తెలియజేస్తూ, వాటిని ఉపయోగించుకొని దళిత కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడానికి ఏవిధంగా ఉపయోగించుకోవాలో వివరించామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి, వివిధ కుల సంఘాల నాయకులు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# బాధ్యతలు స్వీకరించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

**ప్రజాభూమి ప్రతినిధి, నార్సింగి :**

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం నూతనంగా ఇద్దరు రెవెన్యూ ఇన్ స్పెక్టర్లు, ఒక సీనియర్ అసిస్టెంట్ పదవి బాధ్యతలు స్వీకరించారు. శ్రీధర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ 1గా మేఘన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ 2గా బాధ్యతలు స్వీకరించగా సీనియర్ అసిస్టెంట్‌గా లక్ష్మణ్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు వీరు రామాయంపేట, తూప్రాన్ తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా నిర్వర్తించి నార్సింగి మండల తహశీల్దార్ కార్యాలయానికి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ తాము మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. స్థానిక ప్రజలు తమకు సహాయ సహకారాలు అందజేయాలని కోరారు. ఇదిలా ఉండగా నార్సింగి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన నవీన్‌రావు తీప్రాన్‌లోని ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.


# సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

## దౌల్తాబాద్ తహశీల్దార్ చంద్రశేఖరరావు

**ప్రజాభూమి ప్రతినిది, దౌల్తాబాద్:**

ప్రభుత్వం చేపడుతున్న ఆర్థిక సామాజిక రాజకీయ సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని దౌల్తాబాద్ తహశీల్దార్ చంద్రశేఖరరావు అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఆర్థిక సామాజిక కుటుంబ సర్వేపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 6 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆర్థిక సామాజిక రాజకీయ సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తుందని ఆ సర్వేలో పాల్గొనే అధికారులు ఎలాంటి పొరపాట్లు చేయకుండా వారికి కేటాయించిన కుటుంబాలను పూర్తి సమాచారంతో సర్వే నిర్వహించాలన్నారు. ఒక్కొక్క అధికారికి 150 కుటుంబాలు కేటాయించడం జరిగిందని వారు గ్రామంలో నిర్వహిస్తున్న ప్రతి కుటుంబం నుంచి ఏరియా పరిధి పూర్తి సమాచారం తెలుసుకోవాలన్నారు. సర్వే నివేదిక ఫారంలో ఉన్న 56 అంశాలను పూర్తిస్థాయిలో వాస్తవాలను సేకరించాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా సర్వే నిర్వహించడానికి అధికారులు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, ఎంపీవో సయ్యద్ గఫూర్ ఖాద్రి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ, పంచాయతీ కార్యదర్శి నరేశ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.







# కుటుంబ సర్వేపై అవగాహన

**ప్రజాభూమి ప్రతినిది, తూప్రాన్ :**

తూప్రాన్ మున్సిపల్ ఆఫీస్‌లో కుటుంబ సర్వే సంబంధించిన పలు విషయాలను సిబ్బంది ఆర్పీలకు బుధవారం ఆర్డీవో జయచంద్రారెడ్డి, జెడ్పీ సీఈవో ఎల్లయ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను సమగ్రంగా తీసుకోవాలన్నారు. ఎక్కడా పొరపాట్ల జరగకుండా కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. సిబ్బంది నమోదు చేసే ఆధారాల ప్రకారమే ప్రభుత్వం కార్డులను జారీ చేస్తుందని సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈవో ఎల్లయ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు సిబ్బందికి కుటుంబ సర్వేకు సంబంధించిన కొన్ని విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో తూప్రాన్ తహశీల్దార్ విజయలక్ష్మి, తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి, ఎంపీడీవో శేషాద్రి సిబ్బంది పాల్గొన్నారు.

# పక్కాగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే

**ప్రజాభూమి ప్రతినిది, చిన్నశంకరంపేట :**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక సర్వే ప్రక్రియలో సమగ్రంగా ఇంటింటి సర్వేను ఎన్యుమరేటరు పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి, వెంకటయ్య అన్నారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎన్యుమరేటర్లకు నవంబర్ మొదటి వారంలో తెలగాణ ప్రభుత్వం ఇంటింట సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. నవంబర్ 6వ తేదీ నుండి సర్వే మొదలవుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ అబ్దుల్ మన్నన్, ఎంపీడీవో దామోదర్, ఎంపీవో గిరిజారాణి, పంచాయతీ కార్యదర్శులు, ఎస్సీ, ఎస్టీ వార్డెన్స్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాభూమి ప్రతినిది, తూప్రాన్ :**

తూప్రాన్ మండలంలోని మల్కాపూర్‌లో బుధవారం ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం కావడంతో ఆశ్రయం కోల్పోయిన కుటుంబానికి మల్కాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుగౌడ్ ఆర్థికసాయం అందజేశారు. బుధవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు ఎర్ర భూదమ్మ కుటుంబానికి చెందిన గుడిసె అగ్నికి ఆయితయ్యింది. ఇది గమనించిన స్థానికులు వెంటనే స్పందించి నీరు పోసి మంటలు ఆర్పారు. అప్పటికే గుడిసెలోని సామాగ్రి కాలిపోయాయి. ఈ విషయమై స్పందించిన ఆంజనేయులుగౌడ్ గ్రామస్తులు బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. ప్రభుత్వం స్పందించి వారికి సహాయం చేయాలని కోరారు.



# బ్యాంకు మేనేజర్ పదవీ విరమణ





**ప్రజాభూమి ప్రతినిది, మనోహరాబాద్ :**

దీర్ఘ కాలికంగా కాలాకల్ గ్రామీణ వికాస్ బ్యాంకులో బ్యాంకు మేనేజర్‌గా పని చేయడం చాలా సంతోషంగా ఉందని బ్యాంక్ మేనేజర్ ఎండి మక్‌దుమ్ భాయ్ అన్నారు. బుధవారం ఆయన పదవీ విరమణ కార్యక్రమాన్ని బ్యాంక్ ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళ్లకల్ పరిసర ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులు బ్యాంకు సేవలు పొందుతున్న ప్రజలు సేవ దారులు బ్యాంక్ అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు కూడా బ్యాంకు తరపున ఖాతాదారులకు సేవలు అందించామని వివరించారు. చిన్న తరహా వ్యాపారులకు కూడా బ్యాంకు రుణాలు అందించి వారి అభివృద్ధికి కృషి చేసినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన వెంకటేష్ గుప్తాతో పాటు పలువురు వ్యాపారులు బ్యాంక్ వినియోగదారులు పాల్గొని ఆయనకు ఘనంగా సన్మానించి పదవి విరమణ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో వెంకటేష్ గుప్తా, నాగేష్ గుప్తా, శంకర్ గుప్తా, వీరబోయిన కృష్ణ ముదిరాజ్, సుధాకర్ గుప్తా సత్కరించారు.

# రాయపోల్‌లో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి

**ప్రజాభూమి ప్రతినిది, దౌల్తాబాద్ :**

రాయపోల్ మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు కోసం తీసుకున్న 5.25 ఎకరాల ప్రభుత్వ భూమిని తీసుకున్నారని, ఆ భూమిని సాగు చేసుకుంటున్న భూనిర్వాసితులకు న్యాయం చేయాలని భూ బాధితుడు కూచిగారి నర్సయ్య తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం రాయపోల్ మండల కేంద్రం తహశీల్దార్ కార్యాలయంలో భూ నిర్వాసితుల నర్సయ్య తహశీల్దార్ దివ్యకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపోల్ నూతన మండలం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్, కేజీబీవీ పాఠశాల తదితర కార్యాలయాలు నిర్మించడానికి ప్రభుత్వ స్థలం లేనందున కొత్తపల్లి శివారులో సర్వే నంబర్ 265లో గల ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ సర్వే నంబర్‌లో కూచిగారి నర్సయ్య, బోడ నర్సయ్య ఇద్దరు రైతులు సాగు చేసుకుంటూ వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ భూమిని కొత్తపల్లి రైతుల వద్ద నుండి కొనుగోలు చేశారు. ప్రభుత్వం మూడు సంవత్సరల క్రితం మావద్ద నుంచి భూమి తీసుకొని కేజీబీవీ పాఠశాల భవనం నిర్మాణం చేపడుతుంది. అలాగే పోలీస్ స్టేషన్ నిర్మాణానికి స్థలం సేకరించింది. అప్పుడు ఉన్న అధికారులు, ఎమ్మెల్యే, ఎంపీ, ప్రజాప్రతినిధులు భూనిర్వాసితులమైన మాకు ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేయాలని అట్టి స్థలానికి సంబంధించిన పట్ట సర్టిఫికెట్ అందజేయాలని తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.



ప్రజాభూమి

# ఈ ఒక్కటైనా?

**భారత్‌లో మూడు టెస్టుల సిరీస్ అంటే.. రెండు మ్యాచ్‌లు పూర్తయ్యేసరికే టీమ్‌ఇండియా సిరీస్ సొంతం చేసుకుని గట్టు మీద నిలబడి ఉంటుంది. క్లీన్ స్వీప్ మీద లక్ష్యంగా చివరి మ్యాచ్‌కు సిద్ధమవుతుంటుంది. ప్రత్యర్థి జట్టేమో ఈ ఒక్కటైనా గెలిచి పరువు కాపాడుకోవాలని చూస్తుంటుంది. ఎన్నో ఏళ్లుగా నడుస్తున్న కథే ఇది!**



కానీ ఈసారి కథ మారింది. పేలవ ఫామ్, బలహీన జట్టుతో భారత్‌లో అడుగు పెట్టి, అసలు భారత్ ధాటికి నిలవగలదా అనుకున్న న్యూజిలాండ్.. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో సంచలన విజయాలు సాధించి సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడు పరువు కోసం పోరాడాల్సిన స్థితిలో టీమ్‌ఇండియానే ఉంది. ముంబయిలో శుక్రవారం మొదలయ్యే మూడో టెస్టులో గెలవకుంటే వైట్‌వాష్ పరాభవం ఎదుర్కోవడమే కాదు.. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ బెర్తును కూడా ప్రమాదంలో పడేసుకున్నట్లవుతుంది.

న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లో ఫేవరెట్‌గా అడుగు పెట్టి వరుసగా రెండు మ్యాచ్‌ల్లో అనూహ్య పరాభవాలు ఎదుర్కొన్న టీమ్‌ఇండియాకు ఇప్పుడు పరువు కోసం పోరాడాల్సిన పరిస్థితి. చివరిదైన మూడో టెస్టులో ఎలాగైనా గెలిచి తీరాలనే పట్టుదలతో బరిలోకి దిగుతోంది రోహిత్‌సేన. శుక్రవారం నుంచే ఆఖరి సమరం. పన్నెండేళ్లుగా సొంతగడ్డపై సిరీసే కోల్పోని టీమ్‌ఇండియా రికార్డుకు గండికొట్టిన కివీస్.. భారత క్రికెట్‌ను కుదేలు చేసింది. సిరీస్‌లో వైఫల్యంతో కెప్టెన్ రోహిత్ శర్మ, బ్యాటర్ స్టార్ విరాట్ కోహ్లి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. మొత్తంగా జట్టుపై విమర్శల వర్షం కురుస్తోంది. కొత్త కోచ్ గౌతమ్ గంభీర్ కూడా ఒత్తిడిలో పడ్డాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పట్టికలో ఇప్పటికీ అగ్రస్థానంలోనే ఉన్నప్పటికీ.. మూడో టెస్టులోనూ ఓడితే ఫైనల్ బెర్తు సాధించే అవకాశాలు ప్రమాదంలో పడతాయి. రాబోయేది ఆస్ట్రేలియా పర్యటన. దానికి ఆత్మవిశ్వాసంతో సిద్ధమవ్వాలన్నా, డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు సంక్లిష్టం కాకూడదన్నా భారత జట్టు ముంబయిలో గెలిచి తీరాల్సిందే.

ఆ ఇద్దరు ఏం చేస్తారో?: సిరీస్‌లో టీమ్‌ఇండియా సమష్టిగా విఫలమైంది. బ్యాటింగ్ అయితే మరీ ఘోరం. బెంగళూరులో 46 పరుగులకే కుప్పకూలిన జట్టు.. పుణెలో 156 పరుగులకు చేతులెత్తేసింది. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, కోహ్లి సిరీస్‌లో తీవ్రంగా నిరాశపరిచారు. రోహిత్ వరుసగా నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 2, 52, 0, 8 పరుగులు చేస్తే.. కోహ్లి 0, 70, 1, 17 స్కోర్లకు పరిమితమయ్యాడు. ఎంతో అనుభవం ఉన్న సీనియర్లే ఇలా ఆడితే.. కుర్రాళ్ల నుంచి ఏం ఆశిస్తామనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వీళ్లిద్దరినీ జట్టు నుంచి తప్పించాలనే డిమాండ్లు కూడా ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో రోహిత్, కోహ్లి తమ స్థాయికి తగ్గ భారీ ఇన్నింగ్స్‌లు ఆడి తీరాల్సిందే. క్రీజులో ఎక్కువ సమయం గడిపి భాగస్వామ్యాలు నిర్మించాల్సిన బాధ్యత వారిపై ఉంది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఫామ్‌లో ఉండడం శుభపరిణామం. శుభ్‌మన్ కూడా పెద్ద ఇన్నింగ్స్ ఆడాల్సిన అవసరముంది. పంత్, సర్ఫరాజ్ బెంగళూరు టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో చూపించిన పోరాటపటిమను కొనసాగించాలి. బౌలింగ్‌లో అశ్విన్, జడేజా ద్వయంపై ఒత్తిడి నెలకొంది. రెండో టెస్టులో శాంట్నర్ లాంటి సాధారణ స్పిన్నర్ పిచ్‌ను ఎంతో గొప్పగా ఉపయోగించుకోగా.. వీళ్లిద్దరూ ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయారు. పుణె టెస్టుకు అనుకోకుండా జట్టులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్ మాత్రం అదరగొట్టాడు. ఈ స్పిన్ త్రయం తమకు అనుకూలించే వాంఖడె పిచ్‌ను సద్వినియోగం చేసుకుని ప్రత్యర్థిని చుట్టేయాల్సిన అవసరముంది. బుమ్రా, ఆకాశ్‌దీప్ జోడీ ఆరంభంలో వికెట్లు తీయడం కీలకం. మరోవైపు భారత్‌లో తొలిసారి టెస్టు సిరీస్‌ను చేజిక్కించుకున్న న్యూజిలాండ్.. రెట్టించిన విశ్వాసంతో పోరుకు సిద్ధమైంది. ఇంకోసారి సమష్టి కృషితో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలనుకుంటోంది. బ్యాటింగ్‌లో రచిన్ రవీంద్ర, కాన్వే, ఫిలిప్స్, లేథమ్‌ల ఫామ్ ఆ జట్టుకు సానుకూలాంశం. పేసర్లు హెన్రీ, ఒరోర్క్, సౌథీ.. స్పిన్నర్లు శాంట్నర్, అజాజ్ పటేల్‌లతో ఆ జట్టు బౌలింగ్ కూడా బలంగా కనిపిస్తోంది. మ్యాచ్ వేదిక వాంఖడె స్టేడియంలో పిచ్ స్పిన్నర్లకు అనుకూలించనుంది.

**పిచ్ ఎలా ఉందంటే..**

మూడో టెస్టు వేదిక వాంఖడె స్టేడియం పిచ్ స్పిన్నర్లకు సహకరిస్తుంది. సిరీస్‌లో అనుభవాల దృష్ట్యా దాన్ని పెద్దగా మార్చకపోవచ్చు. బెంగళూరులోలా పేస్‌కు అనుకూలించేలా తీర్చిదిద్దినా ప్రమాదమే. పుణె తరహాలో స్పిన్నర్ల స్వర్గధామంలా మార్చినా కష్టమే. కాబట్టి స్పిన్నర్లకు ఓ మోస్తరుగా సహకరిస్తూనే బ్యాటర్లకు ఇబ్బంది లేకుండా వికెట్‌ను సిద్ధం చేసే అవకాశాలున్నాయి.

**35 మంది నెట్ బౌలర్లతో..**

తొలి రెండు టెస్టుల్లో న్యూజిలాండ్ చేతిలో కంగుతిని సిరీస్ కోల్పోయిన భారత జట్టు.. ముంబయిలో జరిగే మూడో టెస్టు కోసం గట్టిగానే సిద్ధమవుతోంది. మూడో టెస్టుకు శిక్షణ ఐచ్ఛికం అని మొదట చెప్పిన మేనేజ్‌మెంట్.. తర్వాత అందరూ తప్పక హాజరు కావాలని ఆదేశించింది. ముంబయి క్రికెట్ సంఘం మైదానంలో బుధవారం ప్రాక్టీస్ చేసిన టీమ్‌ఇండియా.. 35 మంది నెట్ బౌలర్లను ఉపయోగించింది. వీరిలో ఎక్కువమంది స్పిన్నర్లే. రెండో టెస్టులో స్పిన్ బలంతోనే కివీస్ జట్టు భారత్‌పై ఆధిపత్యం ప్రదర్శించిన నేపథ్యంలో.. భిన్నమైన బౌలింగ్ శైలి కలిగిన స్పిన్నర్లను టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ నెట్స్‌కు రప్పించింది. బ్యాటర్లు స్పిన్నర్లను ఎక్కువసేపు ఎదుర్కొని సాధన చేశారు. మూడో టెస్టుకు తొలిరోజు నుంచే స్పిన్‌కు అనుకూలించే పిచ్‌ను తయారు చేస్తున్నట్లు బీసీసీఐ వర్గాల సమాచారం.



# కోహ్లి చేతికి బెంగళూరు పగ్గాలు!

బెంగళూరు: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అభిమానులకు శుభవార్త. స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి మళ్లీ బెంగళూరు పగ్గాలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. మీడియా కథనాల ప్రకారం 2025 సీజన్‌లో బెంగళూరుకు కోహ్లి సారథ్యం వహించనున్నాడు. కెప్టెన్సీ విషయంలో జట్టు మేనేజ్‌మెంట్, కోహ్లి మధ్య చర్చలు జరిగాయని.. నాయకత్వం స్వీకరించేందుకు స్టార్ ఆటగాడు సంసిద్ధత వ్యక్తంజేసినట్లు సమాచారం. 2022 నుంచి బెంగళూరుకు సారథిగా వ్యవహరిస్తున్న డుప్లెసిస్ ఈ ఏడాదే 40వ పడిలో అడుగుపెట్టాడు. దీంతో ఫ్రాంచైజీ ఇప్పుడు మార్పు కోసం చూస్తోంది. శుభ్‌మన్ గిల్ కోసం బెంగళూరు ప్రయత్నించినా.. చర్చలు ఫలించలేదు. ఒకవేళ ఆటగాళ్ల వేలం పాటలో రిషబ్ పంత్ అందుబాటులో ఉంటే అతని కోసం గట్టిగా ప్రయత్నించాలని బెంగళూరు భావిస్తుంది. ఏదేమైనా ప్రస్తుతానికి బెంగళూరు కెప్టెన్‌గా కోహ్లి ముందువరుసలో ఉన్నాడు. 2013 నుంచి 2021 వరకు బెంగళూరుకు కోహ్లి సారథ్యం వహించాడు. 2016లో జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లగా.. తుదిపోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో బెంగళూరు ఓడింది. 2021 సీజన్ తర్వాత నాయకత్వాన్ని వదులుకున్న కోహ్లి.. జట్టులో ఆటగాడిగా కొనసాగుతానని ప్రకటించాడు.




# తమిళ్ తలైవాస్ గెలుపు

తమిళ్ తలైవాస్ అదరగొట్టింది. నరేందర్ ఖండోలా (15) మెరుపులతో ప్రొ కబడ్డీ సీజన్11లో మరో విజయాన్ని నమోదు చేసింది. బుధవారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తలైవాస్ 4425తో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. ఈ పోరులో ఆరంభం నుంచి రెండు జట్లూ దూకుడుగానే ఆడాయి. కానీ ఖండోలా రాణించడంతో విరామ సమయానికి తలైవాస్ 1814తో ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్ధంలో తలైవాస్ జోరు పెంచింది. వరుస పాయింట్లు కొల్లగొట్టి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ క్రమంలో గుజరాత్ జట్టును రెండు సార్లు ఆలౌట్ చేసింది. ఖండోలాతో పాటు సచిన్ (5), సాహిల్ (5), నితీశ్ (4), అమీర్ (4) విజయంలో కీలకమయ్యారు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 3028తో యూపీ యోధాస్‌ను ఓడించింది. బ్రేక్ సమయానికి 119తో స్వల్ప ఆధిక్యంలో నిలిచిన హరియాణాకు.. బ్రేక్ తర్వాతా పోటీ తప్పలేదు. కానీ ఒత్తిడిలో నిలిచిన హరియాణా విజయం సొంతం చేసుకుంది.

# గుజరాత్ కోసం గిల్ త్యాగం



దిల్లీ: గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్ జట్టు కోసం త్యాగం చేశాడు. స్టార్ స్పిన్నర్ రషీద్‌ఖాన్‌కు తొలి ప్రాధాన్యం లభించేందుకు తన వేతనాన్ని తగ్గించుకున్నాడు. దీంతో గుజరాత్ అట్టిపెట్టుకునే ఆటగాళ్ల జాబితాలో రషీద్‌కు మొదటి స్థానం దక్కింది. గిల్ రెండు, సాయి సుదర్శన్ మూడో ప్రాధాన్య ఆటగాళ్లుగా గుజరాత్ అట్టిపెట్టుకుంది. రాహుల్ తెవాతియా, షారుక్ ఖాన్‌లను అన్‌క్యాప్డ్ ఆటగాళ్లుగా కొనసాగించాలని నిర్ణయించింది. ఆటగాళ్ల మెగా వేలం పాటలో 'రైట్ టు మ్యాచ్' కింద మరో క్రికెటర్‌ను తీసుకునే అవకాశం గుజరాత్‌కు ఉంది. "ప్రధాన ఆటగాళ్లను కొనసాగించడానికి, బలమైన జట్టును నిర్మించడానికి తన జీతం తగ్గించుకోవాలని గిల్ నిర్ణయించుకున్నాడు" అని ఐపీఎల్ వర్గాలు తెలిపాయి. 2022 సీజన్‌కు ముందు రూ.8 కోట్లకు గిల్‌ను గుజరాత్ కొనుక్కుంది. ఐపీఎల్ నిబంధనల ప్రకారం అట్టిపెట్టుకునే ఆటగాళ్లలో మొదటి క్రికెటర్‌కు రూ.18 కోట్లు, రెండో ప్లేయర్‌కు రూ.14 కోట్లు, మూడో వ్యక్తికి రూ.11 కోట్లు లభిస్తాయి. అన్‌క్యాప్డ్ ఆటగాళ్లకు ఒక్కొక్కరికి రూ.4 కోట్ల చొప్పున దక్కుతాయి.



## మేం పిచ్‌ల్ని తయారు చేయం: నాయర్

ముంబయి: టెస్టుల్లో నచ్చిన పిచ్‌లు కావాలంటూ టీమ్‌ఇండియా అడగదని జట్టు సహాయక కోచ్ అభిషేక్ నాయర్ అన్నాడు. జట్టు ఆదేశాల మేరకు స్పిన్ పిచ్‌లు తయారు చేస్తారన్న సూచనల్ని నాయర్ తోసిపుచ్చాడు. ఫామ్‌లో లేక ఇబ్బందులు పడుతున్న విరాట్ కోహ్లి, రోహిత్‌శర్మకు నాయర్ మద్దతుగా నిలిచాడు. "మేం పిచ్‌లను తయారు చేయాలని కోరుకుంటాం. కాని అలా చేయం. ఆ పని క్యురేటర్ చేస్తాడు. ఇచ్చిన పిచ్‌పై ఆడతాం. పేస్, స్పిన్.. పిచ్ ఎలాగున్నా బరిలో దిగుతాం. పరిస్థితుల్ని నచ్చినట్లుగా మార్చుకోలేం. కోహ్లి, రోహిత్ పట్ల ప్రతి ఒక్కరిలో అభిమానమే చూశా. అగ్రశ్రేణి ఆటగాడు తన సుదీర్ఘ ప్రయాణంలో గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటాడు. వారిపై నమ్మకం ఉంచాలి. కచ్చితంగా సత్తాచాటుతారు. అందరూ బాగా ఆడేందుకే ప్రయత్నిస్తారు. కోహ్లి, రోహిత్ లాంటి సీనియర్లైనా.. శుభ్‌మన్ గిల్ వంటి జూనియరైనా అంతే. ప్రతి ఒక్కరు బాగా కష్టపడతారు. గొప్ప ఆటగాళ్ల విషయంలో కొన్నిసార్లు ఓపికగా ఉండాలి. త్వరలోనే కోహ్లి, రోహిత్‌లపై ప్రశంసలు కురుస్తాయి" అని నాయర్ అన్నాడు.

**స్పిన్నర్లను దీటుగా ఎదుర్కొనేందుకు..!**

ముంబయి: వరుసగా రెండు టెస్టుల్లో న్యూజిలాండ్ స్పిన్నర్ల చేతిలో బోల్తాపడ్డ భారత్.. ముంబయి మ్యాచ్‌కు పక్కాగా సన్నద్ధమవుతుంది. మూడో టెస్టులో స్పిన్ పిచ్ ఉండే అవకాశం ఉండటంతో కివీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొనేందుకు భారత బ్యాటర్లు సాధన మొదలుపెట్టారు. బుధవారం వాంఖడె స్టేడియంలో జరిగిన నెట్ సెషన్‌లో బ్యాటర్లు ఎక్కువగా స్పిన్ బౌలింగ్ ఎదుర్కోవడంపై దృష్టిసారించారు. ఎడమచేతి వాటం స్పిన్నర్ శాంట్నర్ బౌలింగ్‌లో భారత బ్యాటర్లు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాడు.

# నితీశ్ సత్తా చాటేనా!



మెక్‌కే (ఆస్ట్రేలియా): భారత కుర్రాళ్లకు పరీక్ష! సత్తా చాటి సెలక్టర్లకు భరోసా కల్పించడానికి మంచి అవకాశం! ఆస్ట్రేలియాఎతో భారత్‌ఎ తొలి టెస్టు నేటి నుంచే. బోర్డర్‌గావస్కర్ ట్రోఫీలో బరిలో దిగే భారత సీనియర్ జట్టులో చోటు దక్కించుకున్న తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్‌రెడ్డి కూడా ఈ టెస్టులో ఆడుతున్నాడు. ఈ ఆల్‌రౌండర్ ఎలాంటి ప్రదర్శన చేస్తాడనేది ఆసక్తికరం. ఆసీస్‌లో పిచ్‌లు, పరిస్థితులకు అలవాటు పడేందుకు అతడికి ఇదే గొప్ప ఛాన్స్. ఈ ఏడాది దేశవాళీలో నితీశ్ పెద్దగా రాణించిందేమీ లేదు. దులీప్ ట్రోఫీలో 5 మ్యాచ్‌ల్లో రెండుసార్లు డకౌట్ అయ్యాడు. రెండు వికెట్లే తీశాడు. టీమ్‌ఇండియా సీనియర్ జట్టుకు తన ఎంపిక సరైందే నిరూపించాలంటే భారత్‌ఎ తరపున అతడు రాణించక తప్పదు.

## ఉండేదెవరో.. వెళ్లేదెవరో?

ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఆటగాళ్లకు ఆయా ఫ్రాంచైజీలు గుడ్‌బై చెప్పబోతున్నాయా? వివిధ జట్లను వీడేందుకు స్టార్ ఆటగాళ్లు సిద్ధమయ్యారా? జట్లు అట్టిపెట్టుకునే ఆ ఆటగాళ్లు ఎవరు? వేలం బరిలో దిగే అగ్రశ్రేణి క్రికెటర్లు ఎవరు? ఈ ప్రశ్నలన్నింటికీ నేడు సమాధానం దొరకనుంది. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు జట్లు అట్టిపెట్టుకునే ఆటగాళ్ల జాబితాను వెల్లడించేందుకు గురువారంతో గడువు ముగియనుంది. కొత్త నిబంధనల ప్రకారం ప్రతి జట్టు గరిష్ఠంగా ఆయిదుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకోవచ్చు. రైట్ టు మ్యాచ్ కార్డు ద్వారా మరొకరిని తిరిగి సొంతం చేసుకోవచ్చు.



# ఆ ఒక్కటి తక్కువైంది: కమిన్స్

సిడ్నీ: భారత్‌పై సిరీస్ విజయమే తన తదుపరి పెద్ద లక్ష్యమని ఆస్ట్రేలియా టెస్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అన్నాడు. స్వదేశంలో గత రెండు సిరీస్‌లలో (201819, 202021) ఆసీస్ ఓడిన నేపథ్యంలో అతడిలా వ్యాఖ్యానించాడు. "నా కెరీర్‌లో మిగిలిపోయిన ప్రధాన లక్ష్యం భారత్‌పై సిరీస్ విజయం. ముఖ్యంగా స్వదేశంలో టీమ్‌ఇండియాను ఓడించాలి. రాబోయే బోర్డర్‌గావస్కర్ ట్రోఫీలో ఈ లక్ష్యాన్ని అందుకోవాలని పట్టుదలగా ఉన్నా. సొంతగడ్డపై జరిగిన గత రెండు సిరీస్‌లలో భారత్ చేతిలో ఓడిపోయాం. ఎందుకు మా జట్టు సరైన ప్రదర్శన చేయలేకపోయిందో అర్థం కావట్లేదు. ఈసారి రాణించాలనే లక్ష్యంతో ఉన్నాం" అని కమిన్స్ పేర్కొన్నాడు. గతంలో టీమ్‌ఇండియా సత్తా చాటినా.. ఈసారి వారిని ఆపేందుకు ప్రయత్నిస్తామని తెలిపాడు. 31 ఏళ్ల కమిన్స్ సారథ్యంలో ఆసీస్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ సాధించింది. భారత్‌ను ఓడించి వన్డే ప్రపంచకప్ గెలిచింది. భారత్‌ఆసీస్ మధ్య అయిదు టెస్టుల సిరీస్ నవంబరు 22న ఆరంభం కానుంది.



# ఏ పొట్టను.. ఎలా తగ్గించుకోవాలి?

ఒత్తిడితో సతమతమైనా, శరీరంలో హార్మోన్ల అసమతుల్యత తలెత్తినా, డెలివరీ తర్వాత.. ఇలా వివిధ సందర్భాలలో పొట్ట పెరిగిపోవడం మనకు తెలిసిందే! పొట్ట చుట్టూ ఉండే అవయవాల్లో కొవ్వులు పేరుకుపోవడమే ఇందుకు కారణమంటున్నారు నిపుణులు. నిజానికి ఇలా పెరిగిపోయిన పొట్టంటే ఎవరికీ నచ్చదు.. వెంటనే దీన్ని తగ్గించుకొని తిరిగి నాజూకైన నడుమును సొంతం చేసుకోవాలని ఆరాటపడుతుంటారు. అయితే ఒకరకంగా ఈ ఆలోచన మంచిదే అంటున్నారు నిపుణులు. ఎందుకంటే పొట్ట చుట్టూ పేరుకుపోయిన చెడు కొవ్వు ఎప్పటికైనా ఆరోగ్యానికి హానికరమే అంటున్నారు నిపుణులు. అందుకే దీన్ని ఎంత త్వరగా తగ్గించుకుంటే అంత మంచిదంటున్నారు. అంతేకాదు.. ఏ పొట్టను ఎలా తగ్గించుకోవాలో వివరిస్తూ కొన్ని చిట్కాలు సైతం సూచిస్తున్నారు.



## ప్రసవానంతర పొట్టా?!

డెలివరీ అయ్యాక కూడా పొట్ట ఎత్తుగా కనిపించడం సహజమే! అయినా దీన్ని అంగీకరించడానికి చాలామంది మహిళలు ఇష్టపడరు. ఈ క్రమంలో వెనువెంటనే పొట్ట తగ్గించుకొని తిరిగి నాజూగ్గా మారాలని ఆరాటపడుతుంటారు. ఒత్తిడికీ గురవుతుంటారు. దీనివల్ల ఆరోగ్యానికి నష్టం తప్ప మరే ప్రయోజనం ఉండదు. అందుకే ఒత్తిడికి లోనవకుండా, చక్కటి జీవనశైలిని పాటిస్తే కొన్ని రోజుల్లోనే మార్పు గమనించచ్చంటున్నారు నిపుణులు.

ఈ క్రమంలో ప్రసవం అయ్యాక ఆరు నుంచి ఎనిమిది వారాల తర్వాత గైనకాలజిస్ట్ సలహా మేరకు చిన్న చిన్న వ్యాయామాలు మొదలుపెట్టచ్చు. ఈ క్రమంలో నడక, పాపాయిని ఎత్తుకొని కాసేపు అటూ ఇటూ నడవడం, యోగా, ధ్యానం.. ఇలా కుట్లపై ఒత్తిడి పడని వ్యాయామాల్ని సాధన చేయచ్చు. అలాగే కీగల్ వ్యాయామాలు కూడా వదులైన చర్మం బిగుతుగా మారడానికి దోహదం చేస్తాయి. ఇక ఆహారం విషయానికొస్తే.. నట్స్, డ్రైఫ్రూట్స్, ఆలివ్ నూనె, అవకాడో.. వంటి మంచి కొవ్వుల్ని తీసుకోవాలి. నిపుణుల సలహా మేరకు పోస్ట్ పార్టమ్ స్లిమ్మింగ్ బెల్ట్, చీర చుట్టుకోవడం.. వంటివి ప్రయత్నించచ్చు.

## కూర్చొని తింటే లావైపోరూ!

కొంతమందికి శరీర పైభాగం స్లిమ్‌గా ఉంటుంది.. అదే పొట్ట దగ్గరికొచ్చేసరికి కాస్త లావుగా కనిపిస్తుంది..

ఇందుకు రెండు కారణాలుండచ్చంటున్నారు నిపుణులు. మొదటిది ఎక్కువసేపు కూర్చొని పనిచేయడం, శారీరక శ్రమ లేకపోవడం, జంక్‌ఫుడ్/ప్రాసెస్డ్ ఫుడ్‌కు అలవాటు పడడం.. వంటి వాటి వల్ల పొట్ట చుట్టూ కొవ్వులు పేరుకుపోతాయి. ఇక రెండోది జీర్ణ సంబంధిత సమస్యలు, గ్యాస్ట్రిక్ సమస్యల వల్ల ఎప్పుడు చూసినా పొట్ట ఉబ్బరంగా కనిపిస్తుంటుంది. మరి, ఇలాంటి పొట్టను తగ్గించుకోవాలంటే.. పీచు అధికంగా ఉండే బీన్స్, బ్రకలీ, బెర్రీ పండ్లు, అవకాడో, యాపిల్, తృణధాన్యాలు, డ్రైఫ్రూట్స్.. వంటివి ఎక్కువగా తీసుకోవాలి. ఇందులోని ఫైబర్.. తీసుకున్న ఆహారం సులభంగా జీర్ణమయ్యేలా చేస్తుంది. ఇక నీళ్లు ఎక్కువగా తాగడం, నీటి శాతం అధికంగా ఉండే పండ్లు, కాయగూరలు తీసుకున్నా ఫలితం ఉంటుంది. వీటితో పాటు పొట్టపై ఒత్తిడి పడే కోర్ వ్యాయామాలు, బరువులెత్తడం, మెట్లెక్కడం.. వంటివి సాధన చేయచ్చు. తద్వారా పొట్ట చుట్టూ పేరుకున్న కొవ్వు కరగడంతో పాటు అక్కడి కండరాలు కూడా దృఢమవుతాయి.

## ఒత్తిడి వల్ల..

మన ఆహారపుటలవాట్లు, జీవనశైలి మార్పులు శరీరంలో హార్మోన్లపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. తద్వారా హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. అలాగే మనసులో కలిగే ఆందోళనలు ఒత్తిడి వల్ల.. ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్ స్థాయులు కూడా పెరిగిపోతాయి. పొట్ట ఎత్తుగా కనిపించడానికి ఇది కూడా కారణమే అంటున్నారు నిపుణులు. మరి, ఈ సమస్య నుంచి విముక్తి పొందాలంటే ఒత్తిడి తగ్గించుకోవడంతో పాటు జీవనశైలి మార్పులు అవసరం అంటున్నారు.

ఇందుకోసం.. యోగా, ధ్యానం.. వంటివి సహకరిస్తాయి. ఇవి సాధన చేయడం వల్ల రాత్రుళ్లు నిద్ర కూడా చక్కగా పడుతుంది.. ఫలితంగా శరీరం పునరుత్తేజితం అవుతుంది. అలాగే అనారోగ్యకరమైన కొవ్వులు నిండి ఉండే జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్, నూనె సంబంధిత పదార్థాలను దూరం పెట్టి.. ఆరోగ్యకరమైన కొవ్వులు నిండి ఉన్న చేపలు, నట్స్, డ్రైఫ్రూట్స్.. వంటివి తీసుకోవాలి. ఇక వీటితో పాటు బరువు ఎక్కువగా ఉన్న వారు, స్థూలకాయుల్లో కూడా పొట్ట లావుగానే ఉంటుంది. కాబట్టి పొట్ట పెరిగిపోవడానికి కారణమేదైనా సరే.. ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లు పాటించడం, తీసుకునే ఆహారంలో చక్కెర తగ్గించడం, వ్యాయామాలు చేయడం.. వంటివి రోజువారీ అలవాట్లుగా మార్చుకుంటే సమస్య నుంచి త్వరగా విముక్తి పొందచ్చు.. ఆరోగ్యంగానూ ఉండచ్చు..!



## నయనతార డాక్యుమెంటరీ.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే..!


అగ్ర కథానాయిక నయనతార జీవితంపై డాక్యుమెంటరీ ఫిల్మ్ సిద్ధమైన విషయం తెలిసిందే. ఆమె వృత్తి, వ్యక్తిగత జీవితంపై ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ దీనిని రూపొందించింది. ఇప్పటికే విడుదలైన ప్రోమో సినీప్రియులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈనేపథ్యంలో తాజాగా ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన పలు విశేషాలను ఓటీటీ సంస్థ ప్రకటించింది. 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. నవంబర్ 18 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. అనుకోకుండా సినిమాల్లోకి అడుగుపెట్టారు నయనతార. కాలేజీ రోజుల్లో ఆమె పార్ట్‌టైమ్ మోడల్‌గా వర్క్ చేశారు. ఓ సందర్భంలో ఆమెను చూసిన దర్శకుడు సత్యన్ అంతికాడ్.. 'మనస్సిక్కరే'లో నటిగా అవకాశం ఇచ్చారు. తొలుత దానిని తిరస్కరించిన ఆమె చివరకు ఓకే చెప్పారు. 2003లో ఇండస్ట్రీలోకి వచ్చిన నయన్.. మలయాళం, తమిళం, తెలుగులో వరుస చిత్రాల్లో యాక్ట్ చేశారు. స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. కెరీర్ పరంగా ఎన్నో అవమానాలు, ఎత్తుపల్లాలు చూశారు. 'నేను రౌడీనే' సమయంలో దర్శకుడు విఘ్నేశ్ శివన్‌తో పరిచయం ఏర్పడింది. కొంతకాలానికి వీరి మధ్య ప్రేమ మొదలైంది. కొన్నేళ్లపాటు ప్రేమించుకున్న నయన్ విఘ్నేశ్ పెద్దల అంగీకారంతో 2022లో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. నయనతార చిన్నప్పటినుంచి పెళ్లివరకూ సాగే ప్రయాణాన్ని ఈ డాక్యుమెంటరీలో చూపించనున్నారు. పెళ్లి వేడుక డిజిటల్ రైట్స్ కోసం నెట్‌ఫ్లిక్స్ రూ.25 కోట్లు చెల్లించినట్లు సమాచారం. రెండేళ్ల క్రితం దీని ప్రోమో విడుదల చేశారు. నయన గొప్ప నటి మాత్రమే కాదని.. మంచి మనసున్న వ్యక్తి అందులో విఘ్నేశ్ తెలిపారు.



## నాయకా.. మా నాయకా

సూర్య కథానాయకుడిగా... శివ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కంగువా'. దిశా పటానీ కథానాయిక. కె.ఇ.జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మాతలు. బాబీ దేవోల్ కీలక పాత్రని పోషించారు. ఈ చిత్రం నవంబరు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఇందులోని 'నాయకా... మా నాయకా' అంటూ సాగే పాటని బుధవారం విడుదల చేశారు. దేవిశ్రీప్రసాద్ స్వరపరిచిన ఈ పాటని రాకేందు మౌళి రచించారు. నాయకుడి గొప్పతనాన్ని పొగుడుతూ ఓ తెగ ప్రజలు పాడుకునే పాట ఇదని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: వెట్రి పళనిస్వామి.





## రవితేజ మాస్ జాతర

వేసవి బరిలో 'మాస్ జాతర' చూపిస్తానంటున్నారు కథానాయకుడు రవితేజ. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 75వ చిత్రాన్ని భాను భోగవరపు తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శ్రీలీల కథానాయిక. ఈ సినిమాకి 'మాస్ జాతర' అనే పేరును ఖరారు చేశారు. మనదే ఇదంతా.. అన్నది ఉపశీర్షిక. దీపావళి సందర్భంగా బుధవారం ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అందులో రవితేజ టపాసుల వెలుగుల నడుమ తుపాకీతో నడిచొస్తూ మాస్ లుక్‌లో ఆసక్తికరంగా కనిపించారు. "ఇది అసలు సిసలైన మాస్ మహారాజా సినిమా. అభిమానులు, ప్రేక్షకులకు విందు భోజనంలా ఉంటుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమా వచ్చే ఏడాది మే 9న థియేటర్లలోకి రానుంది. దీనికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కూర్పు: నవీన్ నూలి, ఛాయాగ్రహణం: విధు అయ్యన్న.



## బాలీవుడ్‌లో రష్మిక హవా.. కొత్త చిత్రాన్ని ప్రకటించిన నటి

ముంబయి: దక్షిణాదితోపాటు ఉత్తరాదిలోనూ వరుస చిత్రాలు చేస్తూ కెరీర్‌లో దూసుకెళ్తున్నారు నటి రష్మిక గతేడాది 'యానిమల్'తో విజయాన్ని అందుకున్న ఆమె ప్రస్తుతం చేతినిండా చిత్రాలతో వరుస షూటింగ్స్‌తో గ్యాప్ లేకుండా గడుపుతున్నారు. తాజాగా బాలీవుడ్‌లో మరో ప్రాజెక్ట్ ఓకే చేశారు. 'స్త్రీ', 'బేడియా', 'ముంజ్య' క్రియేటర్స్ దీనిని తెరకెక్కించనున్నారు. విభిన్న కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'థమా' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ రష్మిక తాజాగా ఓ పోస్ట్ పెట్టారు. "ఈ యూనివర్స్ ఒక ప్రేమ కథ కోరుకుంటుంది. దురదృష్టవశాత్తూ అది చాలా ఉద్వేగంతో కూడుకున్నది" అని టీమ్ పేర్కొంది. ఆయుష్మాన్ ఖురానా, నవాజుద్దీన్ సిద్ధిఖీ, పరేశ్ రావల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'ముంజ్య' దర్శకుడు ఆదిత్య సర్పోత్దార్ దీనికి దర్శకత్వం వహించనున్నారు. 'బేడియా', 'స్త్రీ' నిర్మాత దినేష్ విజన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది దీపావళి కానుకగా ఇది విడుదల కానుంది.

printed& Published &edited by Chandra shekar vippala, from Adhya publications, hyderabad, phone no... 9951121243 (Trial version)